అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

ఏపీ జడ్పీ ఎన్నికల్లో
కూటమి ప్రభంజనం..
6

సంపుటి - 3 సంచిక -151 శనివారం 21 నవంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



బైక్ ట్యాక్సీల నిషేధానికి సుప్రీం నో..

నిషేధం కన్నా నియంత్రణే మేలని వ్యాఖ్య

కర్ణాటకలో బైక్ ట్యాక్సీల రద్దు పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

ఆటోలతో పోల్చితే బైక్ ట్యాక్సీలు ఐదు రెట్లు చవకని ప్రస్తావన

2లో.

21వ శతాబ్దపు సాంకేతికతతో కొత్త అవకాశాలు!

సాంస్కృతిక అనుసంధానానికి డిజిటల్ వేదికలు దోహదం : ప్రధాని మోడీ



కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన ప్రత్యర్థి

కేసీఆర్ నా కథలో రావణాసురుడు..

మోడీ విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్ : సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

మాజీ సీఎం కేసీఆర్‌ను రావణాసురుడితో పోల్చిన సీఎం రేవంత్

కేటీఆర్ ఒక మేనేజ్‌మెంట్ కోటా నాయకుడని ఘాటు విమర్శ

తెలంగాణలో తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని స్పష్టీకరణ

బీజేపీకి పాత్ర లేదు, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన ప్రతిపక్షమన్న సీఎం

తెలంగాణకు ఫుట్‌బాల్ స్టార్ రొనాల్డోను ఆహ్వానిస్తామని వెల్లడి



హైదరాబాద్ , నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై, ఆయన కుమారుడు కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను తన కథలో 'రావణాసురుడు'గా అభివర్ణించిన రేవంత్, కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నాయకుడంటూ కొట్టిపారేశారు. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని, కేటీఆర్‌ను తాను అంత సీరియస్‌గా పరిగణించడం లేదని రేవంత్ స్పష్టం చేశారు. "కేటీఆర్ ఒక మేనేజ్‌మెంట్ కోటా నాయకుడు. తండ్రి అండతోనే ఆయన లీడర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి అధ్యక్షుడు కేసీఆర్ కాబట్టి, ఆయన్నే నేను రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తాను" అని అన్నారు. మిగతాది 2లో...



పసిడి ధరలకు భారీ బ్రేక్..

ఒక్కరోజే రూ.5,638 తగ్గి రూ.1,23,893 వద్ద

ముగిసిన 24 క్యారెట్ల పసిడి రేటు

కిలో వెండి ధర ఏకంగా రూ.1.52 లక్షలకు తగ్గుముఖం

అంతర్జాతీయ మార్కెట్లో ఎనిమిది నెలల కనిష్టానికి జారిన స్పాట్ గోల్డ్

రూపాయి విలువ బలపడితే పసిడి రేటు రూ.1 లక్షకు చేరే అవకాశం ఉందంటున్న విశ్లేషకులు



2లో.

కరవు నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం అసత్యాలు

నా ఎత్తు, కేటీఆర్ గడ్డం గురించేనా నీ పంచాయితీ?.. సీఎం రేవంత్ ప్రసంగంపై భగ్గుమన్న హరీశ్

సిద్దిపేట సభలో సీఎం రేవంత్ వ్యక్తిగత విమర్శలకే ప్రాధాన్యమిచ్చారన్న హరీశ్

దేవాదుల వద్ద మోటార్లు పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదని ప్రశ్న



సిద్దిపేట , నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
సిద్దిపేటలో నిర్వహించిన ఇందిరమ్మ జీవిత బీమా సభ అట్టర్ ప్లాప్ కావడంతో సీఎం తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. అసలు సభకు వచ్చిన పథకం గురించి మాట్లాడకుండా తన ఎత్తు, కేటీఆర్ గడ్డం వంటి వ్యక్తిగత విషయాలపై మిగతాది 2లో...

ఘనంగా చుక్కా రామయ్య శత వసంతాల వేడుకలు

మాస్టారి ఇంటికెళ్లి ఆశీస్సులు తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

రెండు సార్లు రామయ్య పాదాలకు నమస్కరించిన ముఖ్యమంత్రి

బాగున్నావా అని రేవంత్‌ను పలకరించిన మాస్టారు

ఎమ్మెల్సీగా ఆయన సహచర్యాన్ని గుర్తు చేసుకున్న సీఎం



హైదరాబాద్ , నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
: చదువుల చుక్కాని, ప్రజా ఉద్యమాలకు పెద్దదిక్కు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు చుక్కా రామయ్య శత వసంతాల వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. రామయ్య మాస్టారి వందో పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెప్పి, మిగతాది 2లో...

మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్లపై ఈడీ మెరుపు దాడులు..



ఖానాపూర్, హైదరాబాద్‌లలో ఉదయం నుంచే ముమ్మరంగా సాగుతున్న తనిఖీలు

రూ.40.96 కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు

ఖానాపూర్ నివాసం వద్ద రేఖను అరెస్ట్ చేసే అవకాశం

హైదరాబాద్ , నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌కు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ ఉదయం ఖానాపూర్‌తో పాటు హైదరాబాద్‌లోని ఆమె నివాసాల్లో ఈడీ అధికారులుమిగతాది 2లో...



'ఎంపవర్‌స్టార్'

2లో.

డిప్యూటీ సీఎం విజన్‌పై ఉపాసన కొణిదెల ప్రశంసలు

పిఠాపురంలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఉపాసన కొణిదెల, స్మృతి ఇరానీ

మహిళలు, విద్యార్థినుల సాధికారతకు పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారన్న ఉపాసన

అపోలో ఫౌండేషన్ 109 మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించిందని వెల్లడి



2లో.

తీరం దాటిన అక్వాన్

ఒడిశా, ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

తీరం దాటే సమయంలో గంటకు 70 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో భారీగా 168.75 మి.మీ వర్షపాతం నమోదు

పంట నష్టంపై సాయం అందించండి..

అర్నబ్, మురసు తుపానుల విధ్వంసం..

ఉద్యాన పంటల పునరుద్ధరణకు రూ.96 కోట్ల సాయం కోరిన సీఎం చంద్రబాబు

అర్నబ్ మురసు తుఫాన్ల ప్రభావంతో ఉద్యాన పంటలకు రూ.1,092 కోట్ల నష్టం

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం చంద్రబాబు లేఖ

దెబ్బతిన్న తోటల పునరుద్ధరణకు రూ.96.33 కోట్ల అదనపు సాయం కోరిన ఏపీ సర్కార్

రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లాల్లో నష్టపోయిన 71,576 మంది రైతులు



2లో.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన ప్రత్యర్థి

(మొదటి పేజి తరువాయి)

బీఆర్ఎస్ నాయకులు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేసిన రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వం తలుచుకుంటే ఆ పార్టీని ఎప్పుడో ఖతం చేసేదని, కానీ ప్రతిపక్షంగా ఉండాలనే ఉద్దేశంతోనే దాన్ని కొనసాగనిస్తున్నామని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి ఎలాంటి ముఖ్య పాత్ర లేదని, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన శత్రువని ఆయన పేర్కొన్నారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతోందని ఆరోపించారు.ఇదే కార్యక్రమంలో, గతంలో ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ వచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, త్వరలో క్రిస్టియానో రొనాల్డోను తెలంగాణకు ఆహ్వానించే ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ అప్పులు, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, లోక్‌సభ సీట్ల పునర్విభజన వంటి అంశాలను ప్రస్తావిస్తూనే, రాష్ట్రంలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' గురించి కూడా మాట్లాడారు.

మోడీ విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్

సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026లో పాల్గొన్న రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీ దేశానికి విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్‌గా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆయన అన్ని రాష్ట్రాలకు వెళ్లేలా కనిపించడం లేదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి తగిన సహకారం అందడం లేదని పేర్కొన్నారు.

తెలంగాణ అభివృద్ధే లక్ష్యం

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టుల సాధన కోసం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని సీఎం తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

నెహ్రూ నుంచి మన్మోహన్ వరకు

దేశాభివృద్ధిలో కాంగ్రెస్ ప్రధాన పాత్ర పోషించిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, మన్మోహన్‌సింగ్ వంటి నాయకుల పాలనలో దేశానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు అందాయని వివరించారు. విద్య, సాగునీరు, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు గుర్తుచేశారు.దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని, రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ముందుకు సాగుతోందని అన్నారు.

వచ్చే రెండేళ్లలో తెలంగాణకు కొత్త దిశ

తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన తెలంగాణగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.

మరోవైపు క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, 8 వేల మంది క్రీడాకారులతో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని తెలంగాణకు తీసుకొచ్చామని, త్వరలోనే పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కూడా రాష్ట్రానికి ఆహ్వానించే ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

తీరం దాటిన అక్వాన్

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీరం దాటింది. ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో ఈ ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య తుపాను తీరాన్ని తాకినట్లు వాతావరణ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. తుపాను తీరం దాటే సమయంలో తీర ప్రాంతంలో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచాయని, అప్పుడప్పుడు వీటి తీవ్రత గరిష్ఠంగా 90 కిలోమీటర్ల వరకు నమోదైందని అధికారులు తెలిపారు.

తీరం దాటిన అనంతరం తుపాను ఉత్తర-ఈశాన్య దిశగా ఒడిశా మీదుగా కదులుతోంది. ఇది రాగల మూడు గంటల్లో తీవ్ర వాయుగుండంగా, ఆ తర్వాతి ఆరు గంటల్లో సాధారణ వాయుగుండంగా మరింత బలహీనపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది.

తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు దక్షిణ ఒడిశాలో విస్తారంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో అత్యధికంగా 168.75 మి.మీ, అరకభద్రలో 162.50 మి.మీ, కంచిలిలో 148.50 మి.మీ వర్షపాతం నమోదైంది.

తుపాను దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే ముందుజాగ్రత్తగా పలు రైళ్లను రద్దు చేసింది. ఒడిశా ప్రభుత్వం లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తుపాను బలహీనపడుతున్నప్పటికీ, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం తదితర ప్రాంతాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

పంట నష్టంపై సాయం అందించండి..

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం చంద్రబాబు లేఖ

అరటి మిర్చి కొబ్బరి పంటల పునరుద్ధరణకు కేంద్ర పథకాల నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి

ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుఫాన్ల ధాటికి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యాన పంటలకు ఏకంగా రూ.1,092 కోట్ల మేర భారీ నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తీవ్రంగా నష్టపోయిన ఉద్యాన పంటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర పథకాల కింద అదనంగా రూ.96.33 కోట్ల ఆర్థిక సాయం అందించాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు.ఈ ఏడాది అక్టోబర్ 28, నవంబర్ 2 తేదీల్లో వరుసగా విరుచుకుపడిన రెండు తుఫాన్ల వల్ల రాష్ట్రంలోని 18 జిల్లాల్లో తీవ్ర విధ్వంసం జరిగిందని చంద్రబాబు వివరించారు. మొత్తం 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 71,576 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ముఖ్యంగా అర్నబ్ తుఫాను ప్రభావంతో 215 మండలాల్లోని 23,211 హెక్టార్లలో తోటలు నాశనమయ్యాయని, ఇందులో ఒక్క అరటి పంటే 15,549 హెక్టార్లలో నేలమట్టమైందని తెలిపారు. అలాగే మురసు తుఫాను ప్రభావంతో 108 మండలాల్లోని 6,748 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని వెల్లడించారు.

రైతులను ఆదుకునేందుకు కేంద్ర పథకాల ద్వారా తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రి కోరారు. తీవ్రంగా నష్టపోయిన అరటి తోటల పునరుద్ధరణ కోసం 'మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్' స్కీమ్ కింద హెక్టారుకు రూ.44 వేల చొప్పున నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన' కింద ఎండుమిర్చి, కూరగాయల పంటల రైతులకు అండగా నిలవాలని కోరారు.కోనసీమ, కాకినాడ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల జిల్లాల్లో మొవ్వ విరిగిన కొబ్బరి చెట్లకు 'కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు' ద్వారా ఆర్థిక సహకారం అందించాలని లేఖలో విన్నవించారు. రైతులకు దీర్ఘకాలిక నష్టాలను తగ్గించేందుకు ఈ సాయాన్ని త్వరితగతిన విడుదల చేయాలని చంద్రబాబు కోరారు.

21వ శతాబ్దపు సాంకేతికతతో కొత్త అవకాశాలు!

సాంస్కృతిక అనుసంధానానికి డిజిటల్ వేదికలు దోహదం : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):

21వ శతాబ్దపు ఆధునిక సాంకేతికత ప్రపంచ దేశాల మధ్య సాంస్కృతిక అనుసంధానానికి, పరస్పర సహకారానికి కొత్త అవకాశాలను సృష్టిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. సాంస్కృతిక, నాగరికతా సంబంధాలు దేశాల మధ్య స్నేహపూర్వక బంధాలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో తొలి షాంఘై సహకార సంస్థ (ఎస్-సీఓ) సివిలైజేషనల్ డైలాగ్ ఫోరమ్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. భారతదేశంలోని మ్యూజియంలు, గ్రంథాలయాలు, పురావస్తు కేంద్రాల్లో వేలాది సంవత్సరాల చరిత్రకు సంబంధించిన విలువైన వారసత్వ సంపద భద్రంగా ఉందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా ఈ అమూల్యమైన సంపదను భవిష్యత్ తరాలకు అందించవచ్చని పేర్కొన్నారు.ఇటీవలి కాలంలో భద్రత, ఆర్థిక వ్యవస్థ, అనుసంధానత వంటి రంగాల్లో ఎస్సీఓ దేశాల మధ్య సహకారం గణనీయంగా పెరిగిందని మోడీ తెలిపారు. ఈ నేపథ్యంలో సాంస్కృతిక, నాగరికతా సహకారం దేశాల మధ్య సంబంధాలను మరింత పటిష్టం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ వేదిక ద్వారా కొత్త ఆలోచనలు, సాంస్కృతిక సహకారానికి సంబంధించిన అవకాశాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.

సామ్రాజ్యాలు ప్రపంచ పటాలను మార్చినప్పటికీ, నాగరికతల మధ్య చర్చలు, సంభాషణలు ప్రపంచ ఆలోచనా విధానాలను ప్రభావితం చేసి మరింత సమృద్ధి చేశాయని వివరించారు. ఎస్సీఓ నాగరికతా వేదిక కేవలం సాంస్కృతిక వేడుకలకే పరిమితం కాకుండా ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే వేదికగా ఎదగాలని ఆకాంక్షించారు.డిజిటల్ వేదికలు సాంస్కృతిక మార్పిడులు, అంతర్జాతీయ సహకారాన్ని మరింత సులభతరం చేస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. ఈ అవకాశాలను ఎస్సీఓ సభ్య దేశాలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి భారత్ ఆతిథ్యమిస్తుండగా, న్యూఢిల్లీలోని చారిత్రక పురానా ఖిల్లాలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పాకిస్థాన్‌తో సహా పలు ఎస్సీఓ సభ్య దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా చుక్కా రామయ్య శత వసంతాల వేడుకలు

(మొదటి పేజి తరువాయి)

ఆశీస్సులు తీసుకునేందుకు రాజకీయ, సామాజిక ప్రముఖులు విద్యానగర్‌లోని ఆయన ఇంటికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా విద్యానగర్‌కు వెళ్లి రామయ్యను కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఇంట్లోకి అడుగు పెట్టగానే ఒకసారి, తిరిగి వెళ్లేటప్పుడు మరోసారి రామయ్య మాస్టారి పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు.కొద్దిరోజులుగా మంచానికే పరిమితమైన రామయ్య ముఖ్యమంత్రిని 'బాగున్నావా' అంటూ పలకరించారు. రామయ్య కుమారులు శ్రీనివాస్, అచ్యుత్, కుమార్తెలు ఉమ, రాజేశ్వరిలను రేవంత్ పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, ఆచార్య హరగోపాల్, ఎమ్మెల్సీ కోదండరాం, కె.రామచంద్రమూర్తిలతో లెక్కల మాస్టారి జీవిత విశేషాల గురించి ముచ్చటిస్తూ ముఖ్యమంత్రి దాదాపు 40 నిమిషాలకు పైగా అక్కడే గడిపారు. రేవంత్ చొరవను జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, హరగోపాల్ ప్రశంసించారు. చుక్కా రామయ్య జన్మదినం తెలంగాణ రాష్ట్రానికి, విద్యారంగానికి పర్వదినమని సీఎం రేవంత్ మీడియాతో అన్నారు. సాయుధ రైతాంగ పోరాటం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు ప్రతి ప్రజా పోరాటంతో కలిసి నడిచిన రామయ్య మాస్టారు మనకు నిలువెత్తు ఆదర్శమని చెప్పారు.

ఐఐటీ అనే పదాన్ని తెలుగువారికి పరిచయం చేసిన ఘనత కూడా ఆయనదేనని కొనియాడారు. సామాజిక పరివర్తన కోసం నిరంతరం తపించిన గొప్ప విద్యావేత్త వందో పుట్టినరోజును తెలంగాణ ప్రజలంతా గర్వంగా భావించాలన్నారు. మండలి సభ్యుడిగా రామయ్య నిర్మాణాత్మక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో చుక్కా రామయ్య, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ వంటి విద్యావేత్తలతో కలిసి పనిచేశానని తాను గొప్పగా చెప్పుకుంటానని రేవంత్ అన్నారు. చట్టసభల్లో ప్రజా సమస్యలను లేవనెత్తడమే కాకుండా వాటి పరిష్కార మార్గాలు కూడా సూచించే అతికొద్ది మంది ప్రజాప్రతినిధుల్లో రామయ్య ఒకరని అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా లేదన్న విషయాన్ని ఆనాడు రామయ్య మండలిలో చెప్పేవరకు ఎవరికీ తెలియదని గుర్తు చేశారు. రావి నారాయణరెడ్డి, పీవీ నరసింహారావు, జైపాల్‌రెడ్డి, చుక్కా రామయ్య వీరంతా కాలానికి, రాజకీయాలకు అతీతమైన వ్యక్తులని రేవంత్ అన్నారు. చుక్కా రామయ్య ఆలోచనల స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా చుక్కా రామయ్యను కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, పట్టు వస్త్రాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రామయ్య జీవితం భావితరాలకు స్ఫూర్తి పాఠమని కొనియాడారు. 1964లో చాదర్‌ఘాట్ ధర్మవంత్ పాఠశాలలో తన గురువు రామయ్యతో ఉన్న అనుబంధాన్ని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గుర్తుచేసుకున్నారు. తరగతి గదిలో రామయ్య మాస్టారు చెప్పే పాఠం ఒక్కసారి వింటే చాలు, అలాగే మనసులో నాటుకుపోయేదని అన్నారు.

కరవు నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం అసత్యాలు

(మొదటి పేజి తరువాయి)

విమర్శలు చేయడానికే రేవంత్ వచ్చారా? అని ప్రశ్నించారు. సొంత జిల్లాలో జనం రాకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి జనాన్ని తరలించిన విషయాన్ని అక్కడి పోలీస్ కమిషనరే స్వయంగా చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితుల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే సభలో బూతులు, అబద్ధాలు వల్లెవేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నీటిని ఎత్తిపోసేందుకు పంపులు, మోటార్లు లేవంటూ సీఎం చెప్పడం పచ్చి మోసమని హరీశ్ ఆరోపించారు. అలాంటప్పుడు దేవాదుల దగ్గర మోటార్లను పూర్తిస్థాయిలో ఎందుకు నడపడం లేదని, శ్రీశైలం నుంచి కేటాయించిన నీటిని ఎందుకు తోడలేకపోతున్నారని నిలదీశారు. కృష్ణా నదిలో రాష్ట్రానికి రావాల్సిన 299 టీఎంసీలను సైతం ఉపయోగించుకోలేని అసమర్థ స్థితిలో ఈ పాలన ఉందని విమర్శించారు. ట్రిబ్యునల్ ముందు సమర్థంగా వాదనలు వినిపించడంలో సర్కారు ఘోరంగా విఫలమైందన్నారు. అబద్ధాలు చెప్పడంలో రేవంత్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని, సభలో మాట్లాడిన పచ్చి అబద్ధాలకు గానూ సీఎం ముక్కు నేలకు రాయాలని హరీశ్ డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించే పనిలో పడి తెలంగాణ సాగునీటి హక్కులను తాకట్టు పెడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. కృష్ణా జలాల దోపిడీకి కాంగ్రెస్ సర్కారే ప్రత్యక్షంగా సహకరిస్తోందని మండిపడ్డారు.

బైక్ ట్యాక్సీల నిషేధానికి సుప్రీం నో..

నిషేధం కన్నా నియంత్రణే మేలని వ్యాఖ్య

న్యూఢిల్లీ: నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):

కర్ణాటకలో బైక్ ట్యాక్సీలపై నిషేధాన్ని సమర్థిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. నిషేధించడం కంటే నియంత్రించడమే సరైన మార్గమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బైక్ ట్యాక్సీలపై నిషేధాన్ని రద్దు చేస్తూ గతంలో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులు జారీ చేసింది.పిటిషన్‌ను తోసిపుచ్చిన అనంతరం జస్టిస్ సతీష్ చంద్ర శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. "జీపీఎస్ సౌకర్యం ఉండటం వల్ల యువతులకు బైక్ ట్యాక్సీలు మరింత సురక్షితం. వీటిని పూర్తిగా నిషేధించే బదులు నిబంధనలతో నియంత్రించడం మేలు. ఇప్పటికే దేశంలోని 25 రాష్ట్రాల్లో ఇవి నడుస్తున్నాయి. మా ఆఫీసులోని యువతులను ఎలా ప్రయాణిస్తున్నారని అడిగితే బైక్ ట్యాక్సీల్లోనే వస్తున్నామని చెప్పారు. ఆటోలతో పోలిస్తే ఇది ఐదు రెట్లు చవక అని వారు తెలిపారు" అని జస్టిస్ శర్మ వ్యాఖ్యానించారు.

గతంలో ఓలా, ఉబెర్, రాపిడో వంటి అగ్రిగేటర్లు దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన కర్ణాటక హైకోర్టు డివిజన్ బెంచ్, వాహనాలను ట్రాన్స్‌పోర్ట్ కేటగిరీ కింద రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని, నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ క్యారేజీలుగా అనుమతులు పరిశీలించాలని స్పష్టం చేసింది. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లగా చుక్కెదురైంది.

'ఎంపవర్‌స్టార్'

డిప్యూటీ సీఎం విజన్‌పై ఉపాసన కొణిదెల ప్రశంసలు

పిఠాపురంలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఉపాసన కొణిదెల, స్మృతి ఇరానీ

పిఠాపురం నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ప్రముఖ వ్యాపారవేత్త, అపోలో హాస్పిటల్స్ వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల పర్యటించారు. కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీతో కలిసి ఆమె పిఠాపురం పరిధిలోని అగ్రహారంలో నూతనంగా నిర్మించిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అపోలో ఫౌండేషన్ చేపట్టిన 'అపోలో ఆరంభ్' ప్రాజెక్టులో భాగంగా కొణిదెల కుటుంబ సహకారంతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విజన్‌ను ఉపాసన కొణిదెల ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల్లో పవన్ కల్యాణ్ 'పవర్ స్టార్'గా సుపరిచితులైనప్పటికీ, పిఠాపురంలో ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు, సాధికారత కార్యక్రమాలను చూసిన తర్వాత తనకు ఆయన 'ఎంపవర్ స్టార్'గా కనిపిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి, రుణాల కల్పనపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఏర్పాటుతో విద్యార్థుల సాధికారతకు కృషి చేస్తున్నారని కొనియాడారు.రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం, ప్రాథమిక విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అపోలో ఫౌండేషన్ 109 మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా మొదటి కేంద్రాన్ని పిఠాపురంలో ప్రారంభించారు. అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ కేంద్రం స్థానిక తల్లులు, చిన్నారులకు ఎంతో ప్రయోజనకరంగా మారనుందని నిర్వాహకులు వెల్లడించారు.

మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్లపై ఈడీ మెరుపు దాడులు..

(మొదటి పేజి తరువాయి)

ఏకకాలంలో ముమ్మర సోదాలు చేపట్టారు.

ఖానాపూర్ మండలం సత్తెనపల్లి వద్ద రేఖానాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు ప్రభుత్వం మిల్లింగ్ నిమిత్తం ధాన్యాన్ని కేటాయించింది. అయితే, 2022-23, 2023-24, 2024-25 రబీ సీజన్లకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యంలో పెద్ద మొత్తంలో బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించకుండా పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీని విలువ మార్కెట్‌లో సుమారు రూ.40.96 కోట్లు ఉంటుందని పౌరసరఫరాల శాఖ గుర్తించింది.

గత ఆగస్టు నెలలో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా ధాన్యం నిల్వలు మాయమైనట్లు తేలింది. దీనిపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఫిర్యాదు చేయడంతో ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. ఈ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టిన ఈడీ అధికారులు తాజాగా రంగంలోకి దిగి సోదాలు చేస్తున్నారు.ప్రస్తుతం ఖానాపూర్‌లోని రేఖానాయక్ నివాసం వద్ద విజిలెన్స్, స్థానిక పోలీసు బలగాలు భారీగా మోహరించాయి. నివాసాల్లో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు, విచారణ అనంతరం ఆమెను అదుపులోకి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పసిడి ధరలకు భారీ బ్రేక్..

ఒక్కరోజే రూ.5,638 తగ్గి రూ.1,23,893 వద్ద ముగిసిన 24 క్యారెట్ల పసిడి రేటు

న్యూఢిల్లీ: నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):

దేశీయ మార్కెట్లో బంగారం ధరలు శుక్రవారం ఒక్కసారిగా భారీగా పతనమయ్యాయి. 10 గ్రాముల పసిడి ధర రూ.1.25 లక్షల దిగువకు పడిపోవడంతో, రానున్న రోజుల్లో ఇది రూ.1 లక్ష వరకు తగ్గుతుందా అనే ఆసక్తికర చర్చ మొదలైంది. అయితే, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, రూపాయి మారకం విలువపైనే ఇది ఆధారపడి ఉంటుందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ వివరాల ప్రకారం.. 24 క్యారెట్ల (999 ప్యూరిటీ) 10 గ్రాముల బంగారం ధర శుక్రవారం సాయంత్రానికి ₹5,638 (సుమారు 4.35%) తగ్గి ₹1,23,893 వద్ద ముగిసింది. అటు కిలో వెండి ధర కూడా రూ.1,60,439 నుంచి రూ.1,52,528కి పడిపోయింది. ఈ ధరల్లో జీఎస్టీ, తయారీ ఛార్జీలు ఉండవు.ఎంసీఎక్స్ (వీజశ) మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర సుమారు ₹1,21,424కి జారింది. ఈ ఏడాది నమోదైన గరిష్ట స్థాయి రూ.1.80 లక్షలతో పోలిస్తే ఇది భారీ తగ్గుదల. మరోవైపు, రాయిటర్స్ నివేదిక ప్రకారం అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్సుకు 3,571 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ బలపడటం, ఈక్విటీ మార్కెట్లలో అమ్మకాలు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత పెంచే సంకేతాలు ఇవ్వడం బంగారం ధరలపై ఒత్తిడి తెచ్చాయి.రూపాయి మారకం విలువ మరింత బలపడి, అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ 3,000 డాలర్లకు పడిపోతే దేశీయంగా పసిడి రూ.1 లక్షకు చేరే అవకాశాన్ని కొట్టిపారేయలేమని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది తెలిపారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు స్థిరంగా ఉండటం ధరకు కొంత మద్దతునిచ్చే అంశం. ప్రస్తుతానికైతే రూ.1 లక్ష స్థాయి అనేది కొన్ని పరిస్థితులపై ఆధారపడి ఉన్న అవకాశమే తప్ప, కచ్చితమైన ముగింపు కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..
శనివారం 21 నవంబర్ 2026

పాడి పరిశ్రమ అభివృద్ధికి బ్యాంకుల రుణ సదుపాయం

పాల ఉత్పత్తి పెంపుపై పాడి రైతులకు అవగాహన.. రెండు ఆవుల కొనుగోలుకు రుణాలు

ధర్మసాగర్/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరోనవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
ధర్మసాగర్ బి.ఎం.సి.యు. పరిధిలోని పాడి రైతులకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పాడి పరిశ్రమ అభివృద్ధి, పాల ఉత్పత్తి పెంపు లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ ధనరాజ్, హనుమకొండ జిల్లా మేనేజర్ మహేష్ కుమార్, పశుసంవర్ధక శాఖ ఏడీ రాధాకృష్ణ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఏజీఎం చైతన్య కుమార్, ఆర్ఎం అజయ్ కిరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు ఎల్నినో ప్రభావంతో పశువుల పెంపకంపై పడే ప్రభావాలు, పాడి పరిశ్రమ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, పశు గ్రాసం సాగు, ప్రభుత్వ సబ్సిడీ పథకాల వినియోగంపై రైతులకు వివరించారు. పశువులకు సమతుల్య పోషకాహారం అందించడం, అధిక పాల దిగుబడి సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు.
విజయ డెయిరీకి పాలు పోస్తున్న పాడి రైతులకు వారి





సిబిల్ స్కోర్, బ్యాంకు నిబంధనల ఆధారంగా రెండు ఆవుల కొనుగోలుకు రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులు తెలిపారు. ఈ రుణాలకు 0.83 శాతం వడ్డీ ఉంటుందని వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాడి పరిశ్రమను విస్తరించుకోవాలని సూచించారు.
విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ బి.ఎం.సి.యు. ధర్మసాగర్ పరిధిలోని అన్ని గ్రామాల పాడి రైతులకు రుణ సదుపాయం కల్పించడం ద్వారా పాల ఉత్పత్తిని మరింత పెంచవచ్చన్నారు. ఆవులు, గేదెల మధ్య వ్యత్యాసాలు, ఏ పశువుల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చు, అధిక పాల దిగుబడినిచ్చే నాణ్యమైన ఆవులు, గేదెలను ఏయే రాష్ట్రాల్లో కొనుగోలు చేయాలనే అంశాలపై వివరించారు.
అనంతరం వివిధ గ్రామాల అధ్యక్షులు, పాడి రైతులతో అధికారులు సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాడి పరిశ్రమలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి తగిన సూచనలు, సలహాలు అందించారు.
ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అధ్యక్షులు, పాడి రైతులు, సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి.

ఎస్పీ ప్రవీణ్

వర్ధన్నపేట/ నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు, మూఢనమ్మకాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట ఎస్పీ ప్రవీణ్ సూచించారు. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో జాగృతి పోలీస్ కళాబృందం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ రహస్య సంఖ్యలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.
ఈ సందర్భంగా ల్యాబర్తి గ్రామ సర్పంచ్ మన్నూరు శారద సోము మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని అన్నారు. మూఢనమ్మకాలను విడనాడి శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని, ఇలాంటి అవగాహన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో నేరాల నివారణకు పోలీసు శాఖకు ప్రజలంతా సహకరించాలని అన్నారు.



ఆకట్టుకున్న జాగృతి కళా ప్రదర్శనలు
జాగృతి పోలీస్ కళాబృందం సభ్యులు పాటలు, నృత్యాలు, నాటికలు, ఇతర కళారూపాలతో నిర్వహించిన ప్రదర్శనలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, సామాజిక నష్టాలను పాటల రూపంలో వివరించారు. సైబర్ నేరగాళ్లు అనుసరించే మోసపూరిత పద్ధతులను నాటికల ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు. మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల వెనుక ఉన్న మోసాలను కళారూపాల ద్వారా వివరించి ప్రజల్లో చైతన్యం కల్పించారు. వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించిన ఈ ప్రదర్శనల ద్వారా చట్టాలపై అవగాహన, సామాజిక బాధ్యత, నేరాల నివారణపై సందేశాన్ని ప్రజలకు చేరవేశారు.



జాగృతి పోలీస్ కళాబృందం ఏఎస్ఐ నాగమణి ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఈ కార్యక్రమాన్ని వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలు పోలీసు శాఖకు సహకరించి నేరరహిత, సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కళాబృందం సభ్యులు కోరారు.

క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి

మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే నాగరాజు

హనుమకొండ/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో చదువుతోపాటు క్రీడలు కూడా కీలకపాత్ర పోషిస్తాయని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హనుమకొండలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ మైదానంలో నిర్వహించిన ఏడో తెలంగాణ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడల సమాఖ్య (ఎస్‌జీఎఫ్) హాకీ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన అవకాశాలు, శిక్షణ, ప్రోత్సాహం కల్పిస్తే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని పేర్కొన్నారు. హాకీ క్రీడలో తెలంగాణ విద్యార్థులు మరింత ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి ఎదురైనప్పుడు





నిరుత్సాహపడకుండా మరింత పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్రస్థాయి పోటీలు దోహదపడతాయని తెలిపారు. తెలంగాణలో క్రీడారంగ అభివృద్ధికి, యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్, హనుమకొండ జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్





అయూబ్, ఎనుమాముల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రియాంక అనిల్, వరంగల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ సరితారెడ్డి, హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్ సౌమ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల చైర్మన్లు, డివిజన్, మండల అధ్యక్షులు, అధికారులు, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.





నూతన వధూవరులకు ఎమ్మెల్యే నాగరాజు ఆశీస్సులు



వర్ధన్నపేట/ నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులు శృతి, నరేంద్రబాబులను ఆశీర్వదించారు. జక్కీ శోభన గోపాల్ కుమార్తె శృతి వివాహం ఉప్పరపల్లి క్రాస్‌లోని చర్చిలో జరగగా ఎమ్మెల్యే పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు నిమ్మాని శేఖర్‌రావు, రాష్ట్ర టెస్కాబ్ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మార్నేని రవీందర్‌రావు



వర్ధన్నపేట/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
కొండేటి జనార్ధన్ కుమారుడు నరేంద్రబాబు, జక్కీ శోభన గోపాల్ కుమార్తె శృతి వివాహ వేడుక ఉప్పరపల్లి క్రాస్‌లోని చర్చిలో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు రాష్ట్ర టెస్కాబ్ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మధుమతి రవీందర్‌రావు హాజరై నూతన వధూవరులు శృతి, నరేంద్రబాబులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బరిగల భాస్కర్, అధికార ప్రతినిధి కొత్తూరు సునీల్, సంపత్‌రెడ్డి, ఒంటిమామిడిపల్లి గ్రామ అధ్యక్షుడు మజ్జిగ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ కుమారస్వామి, కంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన జున్ను రాములు



వర్ధన్నపేట/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):జక్కీ శోభన గోపాల్ కుమార్తె శృతి, నరేంద్రబాబు వివాహ వేడుక ఉప్పరపల్లి క్రాస్‌లోని చర్చిలో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు మాస్ రాష్ట్ర అధ్యక్షుడు జున్ను రాములు హాజరై నూతన వధూవరులు శృతి, నరేంద్రబాబులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వేరోల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలి

ఈ నెల 22న హనుమకొండలో భారీ ఆత్మీయ సమ్మేళనం.. వాల్ పోస్టర్ ఆవిష్కరణ



హసన్‌పర్తి/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
ఈ నెల 22వ తేదీన హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న స్వేరోల ఆత్మీయ సమ్మేళన సభను ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ చతాళ వేణుగోపాల్ పిలుపునిచ్చారు.హసన్‌పర్తి మండల కేంద్రంలో గురువారం స్వేరో నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆత్మీయ సమ్మేళన సభకు సంబంధించిన గోడపత్రికను బీఆర్ఎస్ హసన్‌పర్తి మండల మాజీ అధ్యక్షుడు బండి రజనీకుమార్, 66వ డివిజన్ మాజీ అధ్యక్షుడు పాపిశెట్టి శ్రీధర్, హనుమకొండ జిల్లా ఆత్మ మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ స్వేరో ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలంగాణ గురుకులాల కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఎంతోమంది పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది డాక్టర్లు, ఇంజనీర్లు, పైలట్లుగా ఎదిగేందుకు బాటలు వేశారని కొనియాడారు. పేద కుటుంబాల్లో జన్మించిన పూర్ణ స్వేరో, ఆనంద్ స్వేరోలను ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించే స్థాయికి చేర్చడం ఆయన కృషికి నిదర్శనమన్నారు. గురుకులాల్లో చదువుకున్న విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించిన ఘనత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కే దక్కుతుందని పేర్కొన్నారు.ఈ నెల 22వ తేదీ ఆదివారం కాళోజీ కళాక్షేత్రం, హనుమకొండలో నిర్వహించనున్న స్వేరోల ఆత్మీయ సమ్మేళన సభకు ముఖ్య అతిథిగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరుకానున్న నేపథ్యంలో స్వేరో కుటుంబ సభ్యులు, అభిమానులు, విద్యావంతులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో స్వేరో ఇంటర్నేషనల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదారపు నవీన్ కుమార్, వర్ధన్నపేట నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళన కో-కన్వీనర్ బోస్ రాజేశ్వరి, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఊరిబిండి ఓంకార్ యాదవ్, మేకల అభినేష్, స్వేరో మండల అధ్యక్షుడు మేకల సురేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వల్లాల యాదగిరి, మేకల రాజేందర్, నడ్డునూరి నాగరాజు, ఓయూ నాయకులు పెద్దమ్మ రమేష్, ఆరేపల్లి శ్రవణ్, అంబాల రమేష్, స్వేరో డివిజన్ అధ్యక్షుడు పంగ అఖిల్ కుమార్, మేకల బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

సీఎం సభకు భారీగా తరలివెళ్లిన చేర్యాల ప్రజలు

సిద్దిపేట సభకు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, కార్యకర్తల పయనం

జనగామ/చేర్యాల, నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):



సిద్దిపేట జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభకు చేర్యాల మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాలు, బస్సుల్లో ప్రజలు సిద్దిపేటకు బయలుదేరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో ప్రకటించనున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. సభను విజయవంతం చేసేందుకు చేర్యాల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రజలను సమీకరించారు. దీంతో చేర్యాల ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు సిద్దిపేట సభకు తరలివెళ్లారు.

ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా!

కేసముద్రంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు

కేసముద్రం/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):



ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని శుక్రవారం కేసముద్రం పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అర్హులైన కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించే ఈ పథకం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా ఈ పథకం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రజల కష్టాలను అర్థం చేసుకొని ప్రతి కుటుంబానికి భద్రత, భరోసా, ఆర్థిక స్థిరత్వం కల్పించే లక్ష్యంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేద కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీ. శ్రీనివాసరావు, కౌన్సిలర్లు దూధపాక కృష్ణ, తరాల వీరేష్ యాదవ్, రావుల వినయ్ రెడ్డి, బానోత్ అరుణ కుమారి, జాటోత్ సుజాత, ఆగే రాము, మున్సిపల్ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి జీవిత బీమా భరోసా!

కేసముద్రం మున్సిపాలిటీలో 6,800 కుటుంబాలకు లబ్ధి చేకూరే అవకాశం

ఆన్‌లైన్ నమోదు ప్రారంభం.. డిసెంబర్ 19 వరకు గడువు

కేసముద్రం/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):



ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం మరో కీలక సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టింది. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి అర్హ కుటుంబానికి జీవిత బీమా భరోసా కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ పథకం ద్వారా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 6,800 కుటుంబాలకు లబ్ధి చేకూరే అవకాశం ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న తెలిపారు. అర్హులైన కుటుంబాలు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ప్రారంభమైన నమోదు ప్రక్రియ డిసెంబర్ 19, 2026 వరకు కొనసాగుతుందని వెల్లడించారు.కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ధన్నసరి, కేసముద్రం స్టేషన్, కేసముద్రం విలేజ్, అమీనాపురం ప్రాంతాలను కలుపుతూ మొత్తం నాలుగు క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా క్లస్టర్లలో సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి అర్హులైన కుటుంబాల వివరాల నమోదుకు సహకరిస్తారని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాస్‌బుక్ కలిగిన రైతులకు మాత్రమే రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి అర్హ కుటుంబానికి జీవిత బీమా భరోసా కల్పించే దిశగా ముందడుగు వేయడం అభినందనీయమని సునీత వెంకన్న అన్నారు.

ఈ పథకం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. కావున మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, డిసెంబర్ 19లోపు సంబంధిత క్లస్టర్లలో తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న విజ్ఞప్తి చేశారు.

చిన్నారి సాత్వికకు ఆశీస్సులు అందించిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు



కేసముద్రం/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డుకు చెందిన గొట్టం సతీష్‌మౌనిక దంపతుల కుమార్తె సాత్విక నూతన వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు కేసముద్రం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారి సాత్వికను ఆప్యాయంగా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షల బీమా

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్

భూమి ఉన్నా లేకున్నా అర్హులైన పేద కుటుంబాలకు బీమా భరోసా.. నెల రోజుల పాటు నమోదు ప్రక్రియ

కేసముద్రం/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):



పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ ప్రారంభించారు. కేసముద్రం మండలం పెనుగొండ గ్రామంలో సర్పంచ్ కంకల లక్ష్మి కొమురయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పథకం వివరాలను ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి అర్హులైన పేద కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వర్తిస్తుందని వెల్లడించారు. నెల రోజుల పాటు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, అర్హులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుటుంబ పెద్ద సెల్‌ఫోన్ నంబరుతో గ్రామపంచాయతీ లేదా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. అక్కడి సిబ్బంది ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తారని, జిరాక్స్ ప్రతులు అవసరం లేదని స్పష్టం చేశారు.కుటుంబ పెద్ద అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ప్రభుత్వం రూ.5 లక్షల బీమా పరిహారం అందజేస్తుందని వివరించారు. నమోదు సమయంలోనే బీమా మొత్తాన్ని కుటుంబంలోని ఏయే సభ్యులకు ఎంతెంత ఇవ్వాలనే వివరాలను నామినీల పేర్లతో నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.రైతు బీమా పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేసిందంటూ బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. రైతు బీమా భూమి కలిగిన రైతులకు మాత్రమే వర్తిస్తుందని, భూమిలేని వ్యవసాయ కూలీలు, నిరుపేదలకు ఆ పథకం ద్వారా ప్రయోజనం కలగదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూమి ఉన్నా లేకున్నా తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి అర్హులైన పేద కుటుంబానికి భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని తీసుకొచ్చామని వివరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి కుటుంబానికి మూడు, నాలుగు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, అర్హులకు తెల్ల రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, రెండున్నరేళ్లలో మహబూబాబాద్ నియోజకవర్గానికి 6,500 ఇళ్లను కేటాయించినట్లు వెల్లడించారు.

డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ రాయితీ కల్పించడంతో పాటు, స్వయం సహాయక సంఘాల మహిళలు మరణిస్తే వారు తీసుకున్న రుణాలను ప్రభుత్వమే చెల్లించేలా నిర్ణయం తీసుకున్నామని వివరించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, వృద్ధాప్య పెన్షన్ల సమస్యను కూడా త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ మధుసూదన్ రాజ్, తహసీల్దార్ వివేక్, ఎంపీవో హరీష్, కేసముద్రం సింగిల్ విండో వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి, గుగులోతు దసురు నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ నీలం దుర్గేష్, ఉపసర్పంచ్ నాగుల్ మీరా, కాలే కట్టయ్య, కొయ్యడ అశోక్, బోరెడ్డి వీరారెడ్డి, రావుల కొమురయ్య, తాళ్లపల్లి ఐలయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఐక్యతకు ప్రతీకగా కేసముద్రం ప్రెస్ క్లబ్ ఆవిర్భావం

ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభోత్సవం

మూడు జర్నలిస్టు సంఘాలు..

18 పత్రికల విలేకరులు ఒకే వేదికపైకి

మహబూబాబాద్ జిల్లాలో రెండో ప్రెస్ క్లబ్‌గా ప్రత్యేక గుర్తింపు

కేసముద్రం/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):



కేసముద్రం పట్టణ చరిత్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. జర్నలిస్టుల ఐక్యతకు ప్రతీకగా, ప్రజాస్వామ్య నాలుగో స్తంభమైన పత్రికా రంగానికి వేదికగా కేసముద్రం ప్రెస్ క్లబ్ రూపుదిద్దుకుంది. శుక్రవారం కేసముద్రం మండల కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ చేతుల మీదుగా ప్రెస్ క్లబ్‌ను ఘనంగా ప్రారంభించారు. మహబూబాబాద్ జిల్లాలో రెండో ప్రెస్ క్లబ్‌గా గుర్తింపు పొందిన ఈ వేదిక ప్రారంభంతో స్థానిక జర్నలిస్టుల చిరకాల స్వప్నం సాకారమైంది.

మూడు సంఘాలు.. 18 పత్రికలు.. ఒకే వేదిక!

మూడు జర్నలిస్టు సంఘాలకు చెందిన 18 పత్రికల విలేకరులు సమష్టిగా ముందుకొచ్చి ప్రెస్ క్లబ్‌ను ఏర్పాటు చేసుకోవడం విశేషం. భిన్న పత్రికలు, భిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన గౌరవం, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అందరూ ఏకతాటిపైకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. జర్నలిస్టుల మధ్య ఐక్యత ఉంటే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చనే సందేశాన్ని ఈ ప్రెస్ క్లబ్ చాటిచెప్పింది.

జర్నలిస్టులకు అందుబాటులో ప్రత్యేక వేదిక

ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని పలువురు పేర్కొన్నారు. జర్నలిస్టులు సమావేశమయ్యేందుకు, సమాచారాన్ని పరస్పరం పంచుకునేందుకు, వృత్తిపరమైన అంశాలపై చర్చించుకునేందుకు ప్రెస్ క్లబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. కేసముద్రం అభివృద్ధి ప్రయాణంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు మరో ముందడుగుగా నిలుస్తుందని ఆకాంక్షించారు.

ప్రముఖుల హాజరుతో సందడి

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా డీపీఆర్ఓ పసునూరి రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి, స్థానిక ఎస్సై క్రాంతి కిరణ్, కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు, కౌన్సిలర్లు వల్లందాస్ ఉమా రవి, రావుల వినయ్ రెడ్డి, బానోత్ విజయ బద్య, ఆగే రాము, సుజాత హరీష్ నాయక్, దూడపాక కృష్ణ, తరాల వీరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఎంఎల్ పార్టీ మండల అధ్యక్షుడు శివారపు శ్రీధర్, సీపీఐ మండల అధ్యక్షుడు గుడిశాల వెంకన్న, ఎంసీపీఐయూ నాయకులు కంచ వెంకన్న, మాజీ మార్కెట్ చైర్మన్ నీలం దుర్గేష్, మాజీ జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్ రెడ్డి, కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, దసరా నాయక్, మాజీ ఎంపీటీసీ కొమ్ము రాహుల్, సీపీఐ నాయకుడు చప్పరి శేఖర్, ఉప్పరపల్లి సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి, నారాయణపురం సర్పంచ్ యమునా సుమన్ నాయక్, మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామస్థాయి నాయకులు, స్థానిక ప్రముఖులు హాజరై ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రెస్ క్లబ్ కార్యవర్గం

కేసముద్రం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కొత్తపెల్లి రాములు, ఉపాధ్యక్షులుగా సోమారపు శ్రీరాములు, మంద విక్రమ్, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి రాజేంద్ర చారి, కోశాధికారిగా మిట్టగడుపుల మహేందర్, అధికార ప్రతినిధిగా వేల్పుల రేవంత్, ప్రచార కార్యదర్శిగా బోడ



ప్రశాంత్ వ్యవహరిస్తున్నారు. కార్యవర్గ సభ్యులుగా చంద్రగిరి వంశీ, గంధం సతీష్, తాండూరి ఉమేష్, గంధసిరి యాకన్న, బబ్బూరి సతీష్, సోమారపు దినేష్, చెల్లమల్ల బాలకృష్ణ, మారపాక జగన్, చెల్లమల్ల కిరణ్, కాసు సతీష్ తదితరులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఐక్యతే లక్ష్యం.. ప్రజాసేవే ధ్యేయం

కేసముద్రం ప్రెస్ క్లబ్ ఏర్పాటు కేవలం ఒక ప్రారంభోత్సవ కార్యక్రమానికే పరిమితం కాకుండా జర్నలిస్టుల ఐక్యతకు, వృత్తిపరమైన గౌరవానికి, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలవనుంది. భవిష్యత్తులో జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చర్చలు, సామాజిక అవగాహన కార్యక్రమాలకు ఈ వేదిక కేంద్రంగా మారాలని పలువురు ఆకాంక్షించారు. కేసముద్రం నుంచి ప్రారంభమైన ఈ ఐక్యతా ప్రయాణం జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

ఈ నెల 26న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా జయప్రదం చేయండి

బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు

ఎల్కతుర్తి/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి పకడ్బందీగా అమలు చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్కతుర్తి బస్టాండ్ కూడలిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో వీబీ–జీ రామ్ జీ చట్టాన్ని తీసుకురావడం ద్వారా వ్యవసాయ కార్మికుల ఉపాధి హక్కును కేంద్ర ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు. ఇప్పటికైనా పాత ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి, కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలని, ఏడాదికి 200 రోజుల పని కల్పించి రోజువారీ కూలి రూ.700 చెల్లించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర శాసనసభ ఎన్నికల ముందు వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించి మూడేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు అమలు చేయకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన కరువు నివారణ చర్యలు చేపట్టాలని, చౌక ధరల దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు, డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 26న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాలో కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే జనవరి 9 నుంచి 11 వరకు కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం జరిగే పోరాటాలకు సీపీఐ అండగా ఉంటుందని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, సామాజిక న్యాయం కోసం కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామగ్రామాన సంఘ సభ్యత్వ నమోదు చేపట్టి గ్రామ కమిటీలను నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సంఘ నాయకులు ఏదునూరు వెంకట్రాజం, బత్తిని సదానందం, గోకల రాజయ్య, పసునూరి సునీల్, బండ్లోజు రాజమణి, మునిగాల స్వామి, యాఖూబ్ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో మొక్కజొన్న సాగు చేపట్టాలి

ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగుతో అధిక దిగుబడులు.. రైతులకు శాస్త్రవేత్తల సూచన

జనగామ/చేర్యాల, నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
మొక్కజొన్న సాగుతో రైతులు ఆర్థికంగా మంచి లాభాలు పొందవచ్చని భారత మొక్కజొన్న పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల్, డాక్టర్ మల్లయ్య సూచించారు. చేర్యాల మండలంలోని కడవేరుగు గ్రామంలో గురువారం రైతులకు మొక్కజొన్న సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో మొక్కజొన్నకు సుమారు రూ.3 వేల వరకు ధర పలుకుతోందని తెలిపారు. పౌల్ట్రీ పరిశ్రమతో పాటు ఇంధన తయారీలోనూ మొక్కజొన్న వినియోగం పెరుగుతుండటంతో పంటకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా





నమోదవుతున్న నేపథ్యంలో ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగు చేయడం ప్రయోజనకరమని రైతులకు వివరించారు.రైతులు ఎప్పుడూ పత్తి, వరి పంటలపైనే ఆధారపడకుండా పంట మార్పిడిలో భాగంగా మొక్కజొన్న సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శాస్త్రీయ పద్ధతులు పాటిస్తూ సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించడంతో పాటు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని పేర్కొన్నారు.

అనంతరం సర్పంచ్ సమక్షంలో 25 మంది రైతులకు నాలుగు కిలోల చొప్పున మొక్కజొన్న విత్తన ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కడవేరుగు సర్పంచ్ తాళ్లపల్లి రమేష్, మండల వ్యవసాయ అధికారి అప్రోజ్, ఏఈఓ రజిత, పయనీర్ కంపెనీ ప్రతినిధులు, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విద్యార్థుల ప్రతిభకు విశేష ప్రోత్సాహం.. పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం

చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా ఆధ్వర్యంలో విజయవంతంగా ముగింపు వేడుకలు

తల్లాడ/ నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా ఆధ్వర్యంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుడా చైర్మన్ పూవాళ్ల దుర్గా ప్రసాద్, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ డీసీసీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, ఏఎంసీ చైర్మన్ హనుమంతరావు, కమర్తపు మురళి, రావూరి సాయిధబాబు, పుచ్చకాయల వీరభద్రం తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా సుడా చైర్మన్ పూవాళ్ల దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా ప్రత్యేక చొరవతో వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా, క్రమబద్ధంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ వారోత్సవాలను విజయవంతం చేసిన చైర్మన్ కృషిని ప్రశంసించారు.డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు, యువతలో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా ఎండీ ఖాదర్





బాబా చేపట్టిన కార్యక్రమాలు అభినందనీయమన్నారు. వారం రోజులపాటు అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన చైర్మన్, కార్యదర్శి, గ్రంథాలయ సిబ్బందిని అభినందించారు.

అనంతరం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, నృత్యం, యోగా తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా మాట్లాడుతూ 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయడంలో సహకరించిన ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్యదర్శి, గ్రంథాలయ సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ, సహకారంతో జిల్లా గ్రంథాలయ సంస్థకు నూతన భవనం అందుబాటులోకి రానుండటం సంతోషకరమన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మంత్రి అందిస్తున్న సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. వచ్చే ఏడాది 60వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నూతన గ్రంథాలయ భవనంలో మరింత ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. అందరి సహకారంతో ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి. పద్మజ, గ్రేడ్-1 లైబ్రేరియన్ సీహెచ్ మాలసూరు, గ్రేడ్-3 లైబ్రేరియన్లు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్, ఇతర సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం నమోదు ప్రారంభించిన సర్పంచ్ గుగులోత్ లక్ష్మి ఉమ్లా నాయక్

అర్హులైన ప్రతి కుటుంబం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.. ప్రమాదవశాత్తు కుటుంబ పెద్ద మరణిస్తే రూ.5 లక్షల బీమా

స్టేషన్ ఘన్‌పూర్ 7నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని చిల్పూర్ మండలం ఫతేపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ గుగులోత్ లక్ష్మి ఉమ్లా నాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఫతేపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని అర్హులైన కుటుంబాల వివరాలను నమోదు చేయించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు రూ.5 లక్షల బీమా భరోసా లభిస్తుందని తెలిపారు. కుటుంబ పెద్ద అనుకోకుండా మరణించిన సందర్భంలో కుటుంబ సభ్యులకు ఈ బీమా మొత్తం ఆర్థికంగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పథకానికి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన



వారు అర్హులని, నమోదు సమయంలో రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల వివరాలతో పాటు నామినీ వివరాలను సమర్పించాలని సూచించారు.

గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. గ్రామ ప్రజల సహకారంతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య నాయకత్వంలో ఫతేపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి అధిక నిధులు తీసుకువచ్చి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుతో పాటు పేదలు, మహిళలు, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి భూక్య రాజేందర్, ఉపసర్పంచ్ రంగమ్మ, వార్డు సభ్యులు బాలరాజు, మౌనిక, లక్ష్మి, శాంతమ్మ, లలిత, మహేందర్, సుచిత్ర, వెంకటేష్, నరసింహ, కారోబార్ రతన్ సింగ్, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, అధ్యాపకుల భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలి

ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి భాషబోయిన సంతోష్

స్టేషన్ ఘన్‌పూర్ /నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను తక్షణమే పునఃపరిశీలించాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి భాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ పట్టణ కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జనగామ జిల్లా కార్యదర్శి ఎండీ యూనస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంతోష్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలనే ప్రతిపాదన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ విద్యావ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యారంగ నిపుణులు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలతో ఎలాంటి చర్చలు జరపకుండా ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం సరైన విధానం



కాదన్నారు. విలీన ప్రతిపాదన అమలైతే ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. వేలాది మంది ఇంటర్మీడియట్ అధ్యాపకుల ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం ఎలాంటి హామీ ఇస్తుందని నిలదీశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఇంటర్మీడియట్ విద్యను ఎలా అందిస్తారని ప్రశ్నించారు. అదేవిధంగా నీట్, జేఈఈ, ఈఏపీసెట్ వంటి జాతీయ, రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను ఏ విధంగా సిద్ధం చేస్తారని ప్రశ్నించారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, సంబంధిత సబ్జెక్టుల్లో నిపుణులైన బోధకులు అందుబాటులో ఉన్నారా అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇంటర్మీడియట్ విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, దాని ఉనికికే ప్రశ్నార్థకం చేసే నిర్ణయాలు తీసుకోవడం తగదని హితవు పలికారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విలీన ప్రతిపాదనను వెంటనే పునఃపరిశీలించాలని, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యారంగ నిపుణులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పస్తం పృథ్వీ, సన్నీ, రాజు, కిరణ్, స్వాతి, కీర్తన, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

అర్హులైన ప్రతి కుటుంబం పథకంలో నమోదు చేసుకోవాలి

జిల్లా పంచాయతీ అధికారి జి. వినోద్ కుమార్





తల్లాడ/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త): తల్లాడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లబ్ధిదారుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి జి. వినోద్ కుమార్, సర్పంచ్ పెరిక నాగేశ్వరరావుతో కలిసి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నిరుపేద కుటుంబాలకు ఎంతో భరోసా కల్పిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పథకం అమలు విధానం, అర్హతలు, ప్రయోజనాలను వివరించారు.అనంతరం డీపీఓ తల్లాడ, పినపాక గ్రామ పంచాయతీలను సందర్శించి పంచాయతీ పరిపాలన, పథకం అమలుపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్ రాజు, ఎంపీఓ హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శులు సిద్దిక్ మియా, ప్రసాద్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా కబడ్డీ జట్టుకు యూనివర్సల్ విద్యార్థిని ఎంపిక

కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటిన నంద్యాల భార్గవి

తల్లాడ/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
ఉమ్మడి ఖమ్మం జిల్లా కబడ్డీ జట్టుకు తల్లాడ యూనివర్సల్ విద్యాలయానికి చెందిన పదో తరగతి విద్యార్థిని నంద్యాల భార్గవి ఎంపికైంది. శుక్రవారం మధిర మండలంలోని చెన్నూరులో నిర్వహించిన బాలికల అండర్-17 కబడ్డీ పోటీల్లో భార్గవి తన ప్రతిభను చాటుకుంది. దీంతో ఆమెను ఉమ్మడి ఖమ్మం జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపిక చేశారు.జిల్లా స్థాయి కబడ్డీ జట్టుకు భార్గవి ఎంపిక కావడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ టి.కె. ప్రసన్నన్, డైరెక్టర్ మరి సోఫియా, పీఈటీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భార్గవిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లాడ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



మంత్రి వాకిటి శ్రీహరికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘన స్వాగతం

హనుమకొండ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కారం





హసన్‌పర్తి/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):హనుమకొండ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి ఐనవోలు మండలం పున్నెల క్రాస్ వద్ద వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, రాష్ట్ర టెస్కాబ్ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబం ఇందిరమ్మ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రూ.5 లక్షల జీవిత బీమాతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా

పోస్టర్‌ను ఆవిష్కరించిన డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న



మహబూబాబాద్ /నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి అర్హ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పేద, మధ్యతరగతి కుటుంబాలకు భరోసాగా నిలుస్తుందని డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్, కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించే ఈ పథకానికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను వారు సంయుక్తంగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినా, మరణం సంభవించినా ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోకుండా ఈ పథకం అండగా నిలుస్తుందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, కుటుంబాల ఆర్థిక భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం పథకానికి సంబంధించిన వివరాలను తెలుసుకొని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గూగులోత్ జ్యోతి రమేష్, ఎండీ అవేజ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జెన్నేటి, ఎండీ రషీద్ ఖాన్, బీఎల్ఏ మహమ్మద్ నయీమ్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ సంఘాల నాయకులు, బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జడ్పీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం..

28 స్థానాల్లో ఏకంగా 27 కైవసం!

టీడీపీకి 22 జడ్పీ ఛైర్మన్ స్థానాలు

జనసేనకు 4, బీజేపీకి ఒక స్థానం

వైసీపీకి దక్కిన ఏకైక అల్లూరి జిల్లా

ఛైర్మన్, వైస్ ఛైర్మన్ వివరాలు ఈసీ ప్రకటన

, నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరంలో అధికార కూటమి విజయదుందుభి మోగించింది. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ప్రజా పరిషత్‌ల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు జరిగిన పరోక్ష ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 28 జడ్పీ పీఠాల్లో ఒక్క అల్లూరి జిల్లా మినహా మిగిలిన 27 జిల్లాలను కూటమి తన ఖాతాలో వేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంది.

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ప్రకారం, కూటమి భాగస్వామ్య పక్షాల్లో తెలుగుదేశం పార్టీ అత్యధికంగా 22 జడ్పీ ఛైర్మన్ పదవులను కైవసం చేసుకుంది. జనసేన పార్టీ 4 స్థానాలను, భారతీయ జనతా పార్టీ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్‌కే పరిమితమైంది. అల్లూరి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా వైసీపీ అభ్యర్థి వంతల శాంతి ఎన్నికయ్యారు.



జిల్లాల వారీగా ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్ల ఎంపిక ప్రక్రియ విజయవంతంగా ముగియడంతో పాటు, ఎన్నికైన వారి పేర్లు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల అధికారిక జాబితాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన జిల్లా పరిషత్ పాలకవర్గాల ఎన్నికల ఘట్టం అధికారికంగా పూర్తయింది.

వీరే టీడీపీ చైర్మన్లు : ఇదిలా ఉంటే జిల్లాల వారీగా టీడీపీ నుంచి జడ్పీ ఛైర్మన్ పదవులకు చూస్తే విజయనగరం జడ్పీ ఛైర్మన్‌గా మజ్జి సిరి సహస్ర ఖరారు అయితే విశాఖ జడ్పీ ఛైర్మన్‌గా గాడు అలివేణి పేరు ఖరారు చేశారు. తూర్పు గోదావరి జడ్పీ ఛైర్మన్‌గా కాడ పద్మ ఎంపిక అయ్యారు. ఎన్టీఆర్ జిల్లా జడ్పీ ఛైర్మన్‌గా కోట పుల్లమ్మ ఎంపిక అయ్యారు. గుంటూరు జడ్పీ ఛైర్మన్‌గా ధార అరుణ, పల్నాడు జడ్పీ ఛైర్మన్‌గా పుచ్చకాయల రమాదేవి, ప్రకాశం జడ్పీ ఛైర్మన్‌గా కొక్కిలిగడ్డ ప్రభాకరరావు, నెల్లూరు జడ్పీ ఛైర్మన్‌గా పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కర్నూలు జడ్పీ ఛైర్మన్‌గా చూడి ఉలిగయ్య, అనంతపురం జడ్పీ ఛైర్మన్‌గా గంజే నాగరాజు, శ్రీ సత్యసాయి జడ్పీ ఛైర్మన్‌గా పరిటాల శ్రీరామ్, కడప జడ్పీ ఛైర్మన్‌గా పుత్తా నరసింహారెడ్డి, అన్నమయ్య జడ్పీ ఛైర్మన్‌గా సుగవాసి ప్రసాద్ బాబు, తిరుపతి జడ్పీ ఛైర్మన్‌గా హేమలత పేరు ఖరారు అయ్యారు.

జనసేనఛైర్మన్

శ్రీకాకుళం: కొరికాన భవాని (ఎల్.ఎన్.పేట జడ్పీటీసీ)
పార్వతీపురం మన్యం: నిమ్మల నీలిమ (భామిని జడ్పీటీసీ)
అనకాపల్లి: మోటూరు నాగమణి (పరవాడ జడ్పీటీసీ)
కాకినాడ: బుర్రా దివ్య సునీత రాజ్ (పెద్దాపురం)
ఐదు జిల్లాల్లో వైస్ ఛైర్మన్లు
తూర్పు గోదావరి: పల్నాటి రజని (నిడదవోలు)
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ: ఎలిశెట్టి రామకృష్ణ (కొత్తపేట)
బాపట్ల: కలవకూరి పిచ్చమ్మ (పర్చూరు)
ప్రకాశం: వరికూటి లక్ష్మీ తాయారు (దర్శి)
శ్రీ సత్యసాయి: దాసరి సునేత్ర (గోరంట్ల)

అభిషేక్ రెడ్డి, ప్రజ్ఞశ్రీ నూతన దంపతులకు ఆశీర్వాదం

వివాహ వేడుకకు హాజరై అక్షింతలు వేసి ఆశీర్వదించిన ఎల్‌అండ్‌టీ జిల్లా మేనేజర్ టీఎల్‌కే రెడ్డి

తల్లాడ/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త): మిషన్ భగీరథ జిల్లా అధికారి ఎస్ఈ గడ్డం రాజశేఖర్ రెడ్డి, స్వర్ణలత దంపతుల కుమారుడు అభిషేక్ రెడ్డి, ప్రజ్ఞశ్రీ వివాహ వేడుక శుక్రవారం నంద్యాల జిల్లాలోని శివ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు మిషన్ భగీరథ ఎల్‌అండ్‌టీ ఖమ్మం జిల్లా మేనేజర్ టీఎల్‌కే రెడ్డి హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అభిషేక్ రెడ్డి, ప్రజ్ఞశ్రీలకు వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పిల్లాపాపలతో నిండు నూరేళ్లు ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, సూపరింటెండెంట్ సురేష్, కాంట్రాక్టర్లు, జిల్లా సిబ్బంది తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం!

రంగాపురంలో 21 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్ల పంపిణీ



కేసముద్రం/నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా రంగాపురం గ్రామ సర్పంచ్ కందునూరి భరతమ్మ కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా కేసముద్రం మండలం రంగాపురం గ్రామానికి చెందిన 21 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్లను గురువారం సర్పంచ్ కందునూరి భరతమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో అర్హులైన వారిని గుర్తించి వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నూతనంగా పింఛన్లు పొందిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ తమకు పింఛన్లు మంజూరయ్యేలా కృషి చేసిన సర్పంచ్ కందునూరి భరతమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులకు పింఛన్లు అందేలా కృషి చేస్తున్న సర్పంచ్‌ను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జనార్ధన్, పంచాయతీ కార్యదర్శి బాలూ, కందునూరి మహేష్, సావిత్ర, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ ఆట మొదలైంది!

రాష్ట్రానికి నిజమైన అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తాం -రాహుల్‌ది దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే అజెండా

ప్రధానిపై ద్వేషంతో దేశంపై విషం చిమ్ముతున్నారు:కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, , నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):

తెలంగాణాలో బీజేపీ ఆట మొదలైందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తామని చెప్పారు. ఆ రెండు పార్టీల కుటుంబ, అవినీతి, దోపిడీ పాలన గురించి తెలిసిన ఏ తెలంగాణ బిడ్డా ఇకపై వారికి ఓటు వేయరని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో అవినీతి పాలనకు చరమగీతం పాడి, నిజమైన అభివృద్ధి, సంక్షేమాన్ని బీజేపీ మాత్రమే అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 8 ఎంపీ, 2 ఎమ్మెల్సీ సీట్లు గెలిచి తెలంగాణలో బీజేపీ లేదన్న వారికి గట్టి సమాధానం చెప్పామని గుర్తుచేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీనే గెలుస్తుందన్నారు.

మెరుగైన విద్యుత్, ఉచిత బియ్యం, ఉచిత వైద్యం, మెరుగైన శాంతిభద్రతలు, మౌలిక సదుపాయాల కల్పనతో తెలంగాణను అభివృద్ధి చేస్తామని తెలిపారు.



ప్రధాని మోదీపై ద్వేషంతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. కుట్రపూరిత ఆలోచనతో దేశంపై విషం చిమ్ముతున్నారని విమర్శించారు. ప్రజలు వరుసగా మూడుసార్లు ఓడించినా, వంద ఎన్నికల్లో ఓడి 'సెంచరీ డిఫీటెడ్ లీడర్'గా మారినా రాహుల్ గాంధీలో పశ్చాత్తాపం, మార్పు రాలేదని ఎద్దేవా చేశారు. రాబోయే వంద ఎన్నికల్లోనూ కాంగ్రెవీసకు చిరునామా ఉండదని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆ పార్టీ చిత్తుగా ఓడిపోవడం ఖాయమని చెప్పారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందని రాహుల్ మాట్లాడడం విడ్డూరమని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ నివేదికలు భారత్ వృద్ధిని ప్రశంసిస్తుంటే, రాహుల్ అందుకు విరుద్ధంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 'తుక్డే తుక్డే గ్యాంగ్'తో చేతులు కలిపి దేశంలో అశాంతిని రేకెత్తించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ 60 ఏళ్ల పాలనలో భారత ప్రధాని విదేశాలకు వెళ్తే అప్పుల కోసమే వచ్చారనే భావన ఉండేదని కిషన్‌రెడ్డి చెప్పారు. నేడు మోదీ నాయకత్వంలో జీ20, బ్రిక్స్, క్వాడ్, ఎస్‌సీవో వేదికల్లో భారత్ కీలక పాత్ర పోషిస్తూ ప్రపంచ గౌరవాన్ని పొందుతోందని తెలిపారు. నెహ్రూ హయాంలో 38 వేల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని (అక్సాయ్‌చిన్) చైనాకు అప్పగించిన చరిత్ర కాంగ్రెస్‌దని విమర్శించారు

సీఎంకు కొమురవెల్లి మల్లన్న చిత్రపటం అందజేత

మూడు నెలల్లో కొమురవెల్లి మల్లన్నను దర్శించుకుంటానని సీఎం హామీ

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డికి సీఎం హామీ

జనగామ/చేర్యాల, నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):

సిద్దిపేటలో నిర్వహించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బహిరంగ సభలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి చిత్రపటాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డితో పాటు జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు, కడారి నరేష్ ముఖ్యమంత్రిని కలిసి స్వామివారి చిత్రపటాన్ని అందించి కొమురవెల్లి క్షేత్ర విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ మూడు నెలల్లో కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామివారిని దర్శించుకుంటానని తెలిపినట్లు వారు వెల్లడించారు. ముఖ్యమంత్రి స్వయంగా స్వామివారిని దర్శించుకుంటానని చెప్పడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.



ఏపీలో రెండు నకిలీ వర్సిటీలు..

దేశవ్యాప్తంగా 32 ఫేక్ యూనివర్సిటీలపై యూజీసీ బాంబు!

, నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త):

ఉన్నత చదువులు చదివి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (ఖ+జ) తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా గుర్తింపు లేకుండా నడుస్తున్న 32 నకిలీ విశ్వవిద్యాలయాల జాబితాను విడుదల చేసిన యూజీసీ, ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రెండు సంస్థలను కూడా ఫేక్ వర్సిటీలుగా తేల్చింది.

ఏపీలోని 'క్రైస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ', 'బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా'లకు ఎలాంటి అధికారిక గుర్తింపు లేదని స్పష్టం చేసింది. తెలంగాణలో ప్రస్తుతం ఎలాంటి నకిలీ వర్సిటీలు జాబితాలో లేనప్పటికీ, తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఇతర ప్రాంతాల్లో ప్రవేశాలు పొందే సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని కమిషన్ సూచించింది.

దేశవ్యాప్తంగా నకిలీ విశ్వవిద్యాలయాల జాబితాలో దేశ రాజధాని ఢిల్లీ ఏకంగా 12 నకిలీ సంస్థలతో అగ్రస్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్‌లో నాలుగు వర్సిటీలు ఫేక్‌గా తేలాయి. యూజీసీ చట్టం 1956 ప్రకారం అధికారం లేని సంస్థలు ప్రదానం చేసే డిగ్రీలు ఉన్నత చదువులకు గానీ, ప్రభుత్వ-ప్రైవేట్ ఉద్యోగాలకు గానీ ఎంతమాత్రం చెల్లవని కమిషన్ తేల్చిచెప్పింది. ఏవైనా విద్యాసంస్థల్లో చేరే ముందు వాటి చట్టబద్ధమైన గుర్తింపు, యూజీసీ నిబంధనల ప్రకారం డిగ్రీలు ఇచ్చే అధికారం ఉందా లేదా అన్నది అధికారిక వెబ్‌సైట్ ద్వారా క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించింది.

ఢిల్లీ
మౌంటెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ
వరల్డ్ పీస్ ఆఫ్ యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజినీరింగ్
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్
ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అండ్ ఫిజికల్ హెల్త్ సైన్సెస్ స్టేట్ గవర్నమెంట్ యూనివర్సిటీ
కమర్షియల్ యూనివర్సిటీ లిమిటెడ్
యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ
వొకేషనల్ యూనివర్సిటీ
ఏడీఆర్-సెంట్రిక్ జ్యురిడికల్ యూనివర్సిటీ
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్
విశ్వకర్మ ఓపెన్ యూనివర్సిటీ ఫర్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్
ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయ
ఉత్తరప్రదేశ్
గాంధీ హిందీ విద్యాపీఠ్, ప్రయాగ్‌రాజ్
నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఓపెన్ యూనివర్సిటీ
భారతీయ శిక్షా పరిషత్
మహామాయ టెక్నికల్ యూనివర్సిటీ
కర్ణాటక
గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ
సర్వ భారతీయ శిక్షా పీఠ్
కేరళ
ఇంటర్నేషనల్ ఇస్లామిక్ యూనివర్సిటీ ఆఫ్ ప్రొఫెటిక్ మెడిసిన్
సెయింట్ జాన్స్ యూనివర్సిటీ, కిషనట్టం

రూ.9 కోట్ల మందు రూ.2.5 లక్షలే..

పసిపిల్లల ప్రాణాల కోసం పోరాడిన హైదరాబాద్ డాక్టర్!

హైదరాబాద్ చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ శివరంజని సంతోష్ మానవతా ప్రయత్నం ఫలప్రదం

, నవంబర్ 20 (జర్నలిస్ట్ వార్త)



కళ్ల ముందే కన్నబిడ్డ కరిగిపోతుంటే చూస్తూ తల్లడిల్లిపోవడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయత.. తమ బిడ్డను బతికించుకునే మందు ఉందని తెలిసినా, అది కొండంత ధరతో సామాన్యుడికి అందనంత దూరంలో ఉండటం ఆ తల్లిదండ్రులకు అంతకంటే తీరని శాపం. అలన్-హెర్న్‌డన్-డడ్లీ సిండ్రోమ్ (ఏహెచ్‌డీఎస్) అనే అరుదైన జన్యు సమస్యతో నరకయాతన అనుభవిస్తున్న పసిపిల్లల తల్లిదండ్రుల గుండెకోత ఇది. ఏడాదికి ఏకంగా రూ.9 కోట్లు ఖర్చయ్యే 'టిరాట్రికోల్' ఔషధాన్ని కొనుగోలు చేయడం పేద, మధ్యతరగతి కుటుంబాలకు కలలో కూడా ఊహించని భారం. ఆ పసికందుల ప్రాణాల కోసం, కన్నీటి సాగరంలో మునిగిన కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ఓ వైద్యురాలు కదిలారు. దైవంలా ఆదుకోవడానికి నడుం బిగించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ శివరంజని సంతోష్ అలుపెరగని పోరాటం చేశారు. యాక్సిస్ టు మెడిసిన్స్ ఇండియా సంస్థతో చేతులు కలిపి ఔషధ కంపెనీలతో పోరాడారు. బిడ్డల ప్రాణాల విలువ ముందు ఈ కోట్ల కొలతలు ఎందుకని ప్రశ్నిస్తూ అవిశ్రాంతంగా కృషి చేశారు. ఆమె నిరంతర సంకల్పం ముందు అసాధ్యమనుకున్నది సుసాధ్యమైంది. అమాంతం రూ.9 కోట్లు పలికే ఆ మందు ఖర్చును ఏకంగా రూ.2.5 లక్షలకు తగ్గించడంలో అద్భుత విజయం సాధించారు. కోట్లలో ఉన్న ధరను లక్షల్లోకి తీసుకువచ్చి ఎన్నో కుటుంబాలకు బతుకుపై భరోసా కల్పించారు. ధర తగ్గించడంతోనే ఆమె ప్రయత్నం ఆగిపోలేదు. ఈ అరుదైన నరాల వ్యాధితో పోరాడుతూ నిస్సహాయ స్థితిలో ఉన్న ఏడుగురు చిన్నారులకు ఏడాదికి సరిపడా 'టిరాట్రికోల్' ఔషధాన్ని ఉచితంగా అందించేందుకు కూడా ఏర్పాట్లు పూర్తి చేశారు. నవంబర్ 30న ఈ ఏడుగురు చిన్నారుల కుటుంబాలకు మందులను అందజేయనున్నారు. మగపిల్లల్లో కండరాల క్షీణత, ఎదుగుదల లోపాన్ని మిగిల్చే ఈ రాకాసి వ్యాధిపై పోరాడుతున్న చిన్నారులకు డాక్టర్ శివరంజని చూపిన మానవతా దృక్పథం కొత్త ఊపిరి పోసింది.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

సిరాజ్ ఎంపికపై రాజకీయ దుమారం



మతం పేరుతో పక్కనపెట్టారన్న కాంగ్రెస్ ఎంపీ.. ఆరోపణలను ఖండించిన బీజేపీ

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టులో హైదరాబాద్‌కు చెందిన స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు చోటు దక్కకపోవడం రాజకీయ వివాదానికి దారితీసింది. న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో సిరాజ్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడంపై కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంచి ప్రదర్శన చేస్తున్నప్పటికీ సిరాజ్‌ను ఎంపిక చేయకపోవడానికి ఆయన పేరే కారణమై ఉండవచ్చని, మతపరమైన వివక్ష జరిగిందని ఆరోపించారు.సిరాజ్ గతంలో జట్టుకు ఎన్నో విజయాలు అందించారని, కీలక సమయాల్లో వికెట్లు తీసి తన ప్రతిభను నిరూపించుకున్నారని మసూద్ పేర్కొన్నారు. మంచి ప్రదర్శన ఉన్నప్పటికీ జట్టులో స్థానం కల్పించకపోవడం వెనుక వివక్ష ఉందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.**బీజేపీ తీవ్ర అభ్యంతరం** కాంగ్రెస్ ఎంపీ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. క్రికెట్‌లో మతాన్ని తీసుకురావడం సరికాదని, ఆటగాళ్ల ఎంపిక ప్రతిభ, జట్టు అవసరాలు, పరిస్థితుల ఆధారంగా జరుగుతుందని స్పష్టం చేశారు. సిరాజ్‌ను ఎంపిక చేయకపోవడాన్ని మతపరమైన వివక్షగా చిత్రీకరించడం ద్వారా కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తోందని విమర్శించారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సైతం కులం, మతం ఆధారంగా ఎవరికీ అవకాశాలు నిరాకరించడం లేదని పేర్కొన్నారు. **క్రికెట్ దిగ్గజాల అసంతృప్తి** సిరాజ్‌కు తుది జట్టులో చోటు కల్పించకపోవడంపై మాజీ క్రికెటర్లు సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. సిరాజ్ అనుభవం, బౌలింగ్ సామర్థ్యం, పోరాట పటిమను పరిగణనలోకి తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చక్రంలో 11 మ్యాచ్‌ల్లో 43 వికెట్లు తీసి భారత బౌలర్లలో అత్యధిక వికెట్లు సాధించిన సిరాజ్‌ను పక్కనపెట్టడం చర్చనీయాంశమైంది. **జట్టు కూర్పే కారణమన్న యాజమాన్యం** మరోవైపు భారత జట్టు మేనేజ్‌మెంట్ సిరాజ్ ఎంపిక కాకపోవడంపై వివరణ ఇచ్చింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ జట్టు అవసరాలు, పిచ్ పరిస్థితులు, బౌలర్ల సామర్థ్యాలను పరిశీలించిన తర్వాతే తుది జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. సిరాజ్ విషయంలో ఎలాంటి సమస్య లేదని, జట్టు సమతుల్యతను దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని కోటక్ స్పష్టం చేశారు. క్రీడలను రాజకీయాలకు దూరంగా ఉంచాలి. ఆటగాళ్ల ఎంపికపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమే. అయితే సరైన ఆధారాలు లేకుండా మతపరమైన వివక్ష ఆరోపణలు చేయడం క్రీడా స్ఫూర్తికి మంచిది కాదు. అదే సమయంలో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత జట్టు యాజమాన్యంపై ఉంది. దేశం తరపున ఆడే ప్రతి ఆటగాడికి మతం, ప్రాంతం, కులంతో సంబంధం లేకుండా ప్రతిభే ప్రామాణికం కావాలి. క్రికెట్ మైదానంలో భారతీయులందరినీ ఏకం చేసే జాతీయ భావనకు ప్రాధాన్యత ఇవ్వాలి.

ఆసియా కప్‌లో భారత్ ఆచితూచి అడుగు



- నేపాల్‌తో తొలి పోరులో భారత యువ ఆటగాళ్లకు పరీక్ష.. రాణించని అభిషేక్, వైభవ్

దోహా: ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో భారత్-ఎ జట్టు ఆచితూచి ఆడుతోంది. శుక్రవారం నేపాల్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత యువ ఆటగాళ్లకు గట్టి పరీక్ష ఎదురైంది. టాస్ గెలిచిన నేపాల్ తొలుత బౌలింగ్ ఎంచుకోవడంతో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. స్టార్ ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. అభిషేక్ 13 బంతుల్లో 9 పరుగులు చేసి వెనుదిరగగా, వైభవ్ 32 బంతుల్లో 26 పరుగులు సాధించి వికెట్ కోల్పోయాడు.**నేపాల్ బౌలర్ల కట్టడి** నేపాల్ బౌలర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేస్తూ భారత బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టారు. పిచ్‌పై బంతి నెమ్మదిగా రావడంతో భారీ షాట్లు ఆడేందుకు భారత బ్యాటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడో స్థానంలో వచ్చిన ఆయుష్ బదోని కూడా రెండు పరుగులకే పెవిలియన్ చేరడంతో భారత్ తొలి 11 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయింది. దీంతో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాల్సిన బాధ్యత కెప్టెన్ తిలక్ వర్మ, మిగతా మధ్య వరుస బ్యాటర్లపై పడింది. **యువ ఆటగాళ్లకు కీలక అవకాశం** ఈ టోర్నీ భారత యువ క్రికెటర్లకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలుస్తోంది. కెప్టెన్ తిలక్ వర్మ నాయకత్వంలోని జట్టులో అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్ వంటి ప్రతిభావంతులున్నారు. గత ఏడాది సెమీఫైనల్లో బంగ్లాదేశ్-ఎ చేతిలో సూపర్ ఓవర్‌లో ఓటమి పాలైన భారత్ ఈసారి టైటిల్ సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగింది. ముఖ్యంగా టీ20 క్రికెట్‌లో దూకుడుగా ఆడే యువ బ్యాటర్లు 50 ఓవర్ల ఫార్మాట్‌కు అనుగుణంగా తమ ఆటతీరును మార్చుకోవాల్సిన అవసరం ఉంది. **పాకిస్థాన్‌తో తదుపరి పోరు** గ్రూప్-బిలో భారత్-ఎ, నేపాల్‌తో పాటు పాకిస్థాన్-ఎ, యూఏఈ జట్లు ఉన్నాయి. నవంబర్ 22న పాకిస్థాన్-ఎతో భారత్ తలపడనుంది. ఈ పోరు జట్టుకు మరో కీలక పరీక్ష కానుంది. యువ ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి సమష్టిగా రాణిస్తే టైటిల్ వేటలో భారత్‌కు మెరుగైన అవకాశాలుంటాయి. యువ ప్రతిభకు రైజింగ్ స్టార్స్ వేదిక మంచి అవకాశాన్ని కల్పిస్తోంది. అయితే పేరున్న ఆటగాళ్లు జట్టులో ఉండటం మాత్రమే విజయానికి సరిపోదు. పరిస్థితులకు అనుగుణంగా ఆడటం, వికెట్లను కాపాడు కోవడం, కీలక సమయాల్లో బాధ్యత తీసుకోవడం అవసరం. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు అందుకోవాల నుకునే యువ క్రికెటర్లు ఈ టోర్నీని సద్వినియోగం చేసుకోవాలి.



ఢిల్లీ క్యాపిటల్స్‌కు మహేళ జయవర్ధనే...

క్రికెట్ డైరెక్టర్‌గా శ్రీలంక మాజీ కెప్టెన్ నియామకం.. 2027 మహిళల ప్రీమియర్ లీగ్‌పై ప్రత్యేక దృష్టి

న్యూఢిల్లీ: శ్రీలంక క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ మహేళ జయవర్ధనే ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2027 మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) సీజన్‌కు ముందు ఈ నియామకం జరిగింది. జట్టు వ్యూహరచన, ప్రతిభావంతులైన క్రీడాకారిణుల గుర్తింపు, ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది అభివృద్ధి వంటి కీలక బాధ్యతలను ఆయన పర్యవేక్షించనున్నారు. మహిళా క్రికెట్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ నియామకం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. **అంతర్జాతీయ అనుభవం.. విజయవంతమైన నాయకత్వం** మహేళ జయవర్ధనే అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. శ్రీలంక తరఫున 149 టెస్టులు, 448 వన్డేలు ఆడి వరుసగా 11,814, 12,650 పరుగులు సాధించారు. 2014లో శ్రీలంక టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన జట్టులో ఆయన కీలక సభ్యుడిగా ఉన్నారు. ఆటగాడిగా మాత్రమే కాకుండా కెప్టెన్‌గా, కోచ్‌గా కూడా విశేష అనుభవం సంపాదించారు. **ముంబై ఇండియన్స్‌కు మూడు టైటిళ్లు** కోచింగ్ రంగంలోనూ జయవర్ధనే తనదైన ముద్ర వేశారు. ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్‌గా వ్యవహరించిన సమయంలో 2017, 2019, 2020 సంవత్సరాల్లో మూడు ఐపీఎల్ టైటిళ్లను సాధించడంలో కీలక పాత్ర పోషించారు. టీ20 క్రికెట్‌లో జట్టు నిర్మాణం, ఆటగాళ్ల ఎంపిక, వ్యూహాత్మక నిర్ణయాల్లో ఆయనకు మంచి అనుభవం ఉంది. ఈ అనుభవం ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టుకు ఉపయోగపడుతుందని ఫ్రాంచైజీ యాజమాన్యం ఆశిస్తోంది. **టైటిల్ లక్ష్యంగా ఢిల్లీ క్యాపిటల్స్** ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్య ప్రతినిధులు మహేళ నియామకంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆయన అనుభవం, ఆధునిక క్రికెట్‌పై అవగాహన జట్టుకు కొత్త దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రతిభావంతులైన క్రీడాకారిణులు ఉన్న జట్టులో మరింత నిలకడ తీసుకురావడం, ఆటతీరును మెరుగుపరచడం తన ప్రధాన లక్ష్యమని మహేళ తెలిపారు. డబ్ల్యూపీఎల్‌లో ఇప్పటివరకు నాలుగుసార్లు రన్నరప్‌గా నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టు వచ్చే సీజన్‌లో తొలి టైటిల్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. **మహిళా క్రికెట్‌కు కొత్త బలం** ప్రపంచ వ్యాప్తంగా మహిళా క్రికెట్‌కు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో అనుభవజ్ఞులైన మాజీ క్రికెటర్లకు కీలక బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించు కుంది. ఆటగాళ్లలో నైపుణ్యాన్ని పెంపొందించడం, యువ ప్రతిభను వెలికితీయడం, మెరుగైన శిక్షణా విధా నాలను అమలు చేయడం ద్వారా జట్ల స్థాయిని పెంచవచ్చు. మహేళ జయవర్ధనే వంటి అనుభవజ్ఞుడి నాయకత్వం ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టుకు ఎంతవరకు విజయాలను అందిస్తుందో 2027 సీజన్‌లో తేలనుంది.



మోదీని కలిశాక మారిన అదృష్టం!

●ప్రధాని భేటీతో మళ్లీ పరుగుల వరద.. ఫామ్‌లోకి వచ్చిన సూర్యకుమార్ యాదవ్



ముంబై: టీమిండియా స్టార్ బ్యాటర్, మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన కెరీర్‌లో ఎదురైన ఒడిదుడుకుల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసిన తర్వాత తన అదృష్టం మారిందని, మళ్లీ పరుగులు సాధించడం ప్రారంభించానని తెలిపాడు. ఇటీవల ఓ కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ప్రధాని మోదీతో జరిగిన భేటీని గుర్తుచేసుకున్నాడు.**45 నిమిషాల పాటు సాగిన భేటీ** ప్రధానిని కలిసేందుకు వెళ్లినప్పుడు ఐదు లేదా పది నిమిషాలు మాత్రమే మాట్లాడతానని భావించానని, అయితే ఆ సమావేశం దాదాపు 45 నిమిషాల పాటు కొనసాగిందని సూర్యకుమార్ తెలిపాడు. ఈ భేటీలో తన కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారని, తన జీవితంలో మధురమైన సందర్భాల్లో ఇదొకటని పేర్కొన్నాడు. ప్రధానితో మాట్లాడిన అనుభవం తనకు ఎంతో ప్రత్యేకమని వెల్లడించాడు. **ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలనే విషయంపై చర్చ** క్రికెట్‌లో ఒత్తిడిని ఎదుర్కోవడం, క్లిష్ట పరిస్థితుల్లో ప్రశాంతంగా ఉండటం గురించి ప్రధానితో చర్చించినట్లు సూర్యకుమార్ తెలిపాడు. మ్యాచ్‌ల సమయంలో ఒత్తిడిని అధిగమించడం కొన్నిసార్లు కష్టంగా ఉంటుందని, దేశ ప్రధానిగా ఎన్నో బాధ్యతలు నిర్వహిస్తూ మోదీ వాటిని ఎలా సమర్థంగా ఎదుర్కొంటారో తెలుసుకోవాలనే ఆసక్తి తనకు కలిగిందని చెప్పాడు. తాను అడిగిన ప్రశ్నలకు ప్రధాని ఓపికగా సమాధానాలు ఇచ్చారని వివరించాడు.**మళ్లీ ఫామ్‌లోకి సూర్యకుమార్** టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఫామ్ కోల్పోవడంతో భారత జట్టులోనూ స్థానం కోల్పోయాడు. అయితే ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో వరుసగా రెండు అర్ధశతకాలు సాధించి తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. దీంతో మళ్లీ భారత జట్టులోకి పునరాగమనం చేస్తాడనే ఆశలు పెరిగాయి. **ఆత్మవిశ్వాసమే విజయానికి బాట** క్రీడాకారుల జీవితంలో విజయాలు, అపజయాలు సహజం. ఒక దశలో అద్భుతంగా రాణించిన ఆటగాళ్లు మరో దశలో ఫామ్ కోల్పోవచ్చు. అలాంటి సమయంలో మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరం. సూర్యకుమార్ యాదవ్ తాజా ప్రదర్శన కూడా అదే విషయాన్ని తెలియజేస్తోంది. తిరిగి తనదైన ఆటతీరుతో రాణించి జాతీయ జట్టులో స్థానం సంపాదించడమే ఇప్పుడు అతడి ముందున్న లక్ష్యం.

బాల్ టాంపరింగ్ వివాదం మళ్లీ రగిల్చిన ఖవాజా!

ఆత్మకథలో సంచలన విషయాలు.. తీవ్రంగా స్పందించిన ఫ్యానీ డివిలియర్స్

స్పోర్ట్స్ డెస్క్: ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన 2018 బాల్ టాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. మాజీ ఆస్ట్రేలియా క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథ 'సబర్'లో వెల్లడించిన విషయాలు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంపై దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఫ్యానీ డివిలియర్స్ ఘాటుగా స్పందించినట్లు వార్తలు వెలువడ్డాయి. **ఆత్మకథలో సంచలన వ్యాఖ్యలు** 2018లో దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టు మ్యాచ్ సందర్భంగా ఆస్ట్రేలియా ఆటగాడు కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ ఇసుక కాగితంతో బంతి స్వభావాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తూ కెమెరాలకు చిక్కాడు. ఈ ఘటన అప్పట్లో ప్రపంచ క్రికెట్‌లో పెను సంచలనం సృష్టించింది. అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌కు ఏడాది పాటు నిషేధం విధించగా, బాన్‌క్రాఫ్ట్‌పై తొమ్మిది నెలల నిషేధం పడింది.అయితే ఈ ఘటనలో కేవలం ముగ్గురికే సంబంధం ఉందన్న అప్పటి అధికారిక వాదనను ఖవాజా తన ఆత్మకథలో ప్రశ్నించాడు. జట్టులోని చాలామందికి బంతి ఆకారాన్ని మార్చే ప్రయత్నాల గురించి తెలుసని, డ్రెస్సింగ్‌రూమ్‌లో ఈ అంశంపై చర్చలు జరిగాయని పేర్కొన్నాడు. తాను స్వయంగా బంతిని దెబ్బతీయలేదని, కానీ జరుగుతున్న విషయాలు తనకు తెలుసని అంగీకరించాడు. జట్టుగా అందరూ బాధ్యత తీసుకోవాల్సి ఉండగా, ముగ్గురిపైనే నింద పడటం సరికాదన్నది ఆయన అభిప్రాయం. **సహచరులపై నమ్మకద్రోహమా?** ఖవాజా వెల్లడించిన విషయాలు క్రికెట్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలకు దారితీశాయి. ఈ నేపథ్యంలో ఫ్యానీ డివిలియర్స్ ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టినట్లు ఆంధ్రజ్యోతి కథనం పేర్కొంది. ఆత్మకథ ద్వారా పాత వివాదాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావడం, సహచర ఆటగాళ్లను వివాదంలోకి లాగడం సరైన చర్య కాదన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. జట్టు అంతర్గత విషయాలను బహిరంగంగా వెల్లడించడం ద్వారా సహచరుల నమ్మకాన్ని దెబ్బతీశారన్న అభిప్రాయాలు వినిపించాయి.**ఖవాజా వివరణ** తన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలకు ఖవాజా కూడా స్పందించాడు. తాను ఎవరినీ ఇబ్బందుల్లోకి నెట్టాలని ప్రయత్నించలేదని స్పష్టం చేశాడు. ఈ ఘటనలో తనతో పాటు పర్యటనలో పాల్గొన్న వారందరూ బాధ్యత తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపాడు. నిషేధానికి గురైన ముగ్గురు ఆటగాళ్లు మిగతావారి తరఫున కూడా శిక్ష అనుభవించారని, వారికి న్యాయం జరగాలన్నదే తన ఉద్దేశమని వివరించాడు. **మళ్లీ చర్చకు వచ్చిన ఎనిమిదేళ్ల నాటి ఘటన** ఎనిమిదేళ్ల క్రితం ముగిసినట్లు భావించిన బాల్ టాంపరింగ్ వివాదం ఖవాజా ఆత్మకథతో మరోసారి చర్చనీయాంశమైంది. అప్పట్లో క్రికెట్ ఆస్ట్రేలియా నిర్వహించిన విచారణలో వెల్లడైన అంశాలు, ఇప్పుడు ఖవాజా చెబుతున్న విషయాల మధ్య వ్యత్యాసాలు కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఆటగాళ్ల మధ్య పరస్పర ఆరోపణలు, పాత జట్టు వ్యవహారాలపై భిన్నమైన వాదనలు ఆస్ట్రేలియా క్రికెట్‌లో మరోసారి కలకలం రేపుతున్నాయి.



అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



విజయ్ సేతుపతి రూట్లో నస్లెన్

'ప్రేమలు'లో అమాయకమైన లవర్ బాయ్‌గా కనిపించిన నస్లెన్ ఇప్పుడు సూర్యకే విలన్‌గా మారిపోయారు. 'సీన్' సినిమాలో ఈశ్వరన్ పాత్రతో తనలోని మరో యాంగిల్ చూపించారు. అంతకుముందు 'లోకా'లో కళ్యాణి ప్రియదర్శన్‌తో కలిసి నటించారు. ఇప్పుడు 'బ్యాచిలర్ పార్టీ డ్యూక్స్'లోనూ పెద్ద తారాగణంతో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. హీరోగా మంచి క్రేజ్ వచ్చినా సోలో సినిమాల కోసమే ఎదురుచూడకుండా ఇలా విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటున్న తీరు చూస్తుంటే విజయ్ సేతుపతి గుర్తుకొస్తున్నారు. విజయ్ సేతుపతి కూడా తన కెరీర్‌లో హీరో పాత్రలకే పరిమితం కాలేదు. '96'లో ప్రేమికుడిగా మెప్పించిన ఆయన 'విక్రమ్ వేద', 'మాస్టర్', 'విక్రమ్', 'జవాన్' సినిమాల్లో నెగెటివ్ పాత్రలతో అదరగొట్టారు. మరోవైపు 'మహారాజ'తో సోలో హీరోగానూ భారీ విజయం అందుకున్నారు. స్టార్ హీరోలతో కలిసి నటించడానికి ఎప్పుడూ వెనకాడలేదు. పాత్ర నచ్చితే తన ఇమేజ్ గురించి పెద్దగా పట్టించుకోకుండా సినిమాలు చేయడం సేతుపతికి బాగా కలిసొచ్చింది. ఇప్పుడు నస్లెన్ కూడా దాదాపు అలాంటి రూట్‌లోనే వెళ్తున్నారు. 'ప్రేమలు'తో యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించిన తర్వాత వరుస ప్రేమకథలు చేసే అవకాశం ఉన్నా, సూర్య 'సీన్'లో సైకో కిల్లర్ పాత్రకు ఓకే చెప్పారు. దర్శకుడు జీతూ మాధవన్ కూడా నస్లెన్ లాంటి యంగ్ హీరో ఈ పాత్రకు అంగీకరిస్తారా అని మొదట అనుకున్నారట. కానీ నస్లెన్ తన కొత్త ఇమేజ్‌ను వదిలి ఇంత డార్క్ క్యారెక్టర్ చేయడం విశేషం. అయితే విజయ్ సేతుపతి జర్నీలో నస్లెన్ నేర్చుకోవాల్సిన మరో విషయం కూడా ఉంది. ఒక దశలో సేతుపతికి విలన్ ఆఫర్లు ఎక్కువయ్యాయి. స్టార్ హీరోల సినిమాల్లో తన సన్నివేశాలు ఎడిటింగ్‌లో తగ్గిపోయిన సందర్భాలున్నాయని కూడా చెప్పారు. దీంతో కొంతకాలం విలన్ పాత్రలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. నస్లెన్ కూడా వరుసగా పెద్ద హీరోల సినిమాల్లో విలన్ పాత్రలు చేస్తే, హీరోగా సంపాదించుకున్న గుర్తింపు కంటే నెగెటివ్ క్యారెక్టర్లకే డిమాండ్ పెరిగే ఛాన్స్ ఉంది.

పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన సమంత..



ప్రముఖ నటి సమంత మాతృత్వపు మధురిమలను ఆస్వాదిస్తున్నారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని సమంత, ఆమె భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరు స్వయంగా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు.బాబు చిన్ని వేళ్లు సమంత వేలిని పట్టుకున్న అపురూపమైన చిత్రాన్ని పంచుకుంటూ తమ కుమారుడి పేరును 'దేవ్ నిడిమోరు'గా ఖరారు చేసినట్లు ప్రకటించారు. 2026 నవంబరు 19న తమ బాబు జన్మించాడని, ఈ సమయం తమ జీవితంలోనే అత్యంత ఆనందకరమైన క్షణమని ఈ జంట భావోద్వేగంతో రాసుకొచ్చారు.బాబు రాకకు ముందే, నవంబరు 17న వీరి ఇంట్లో కుటుంబ సభ్యుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. తల్లీబిడ్డల ఆరోగ్యం, సుఖ ప్రసవం కోసం 'మాతృ శిశు మంగళ ఆశీర్వాదం' పేరుతో వేడుక జరిగింది. ఈ పూజలో సమంత ఎరుపు రంగు సాంప్రదాయ దుస్తుల్లో మెరవగా, రాజ్ క్రీమ్ కలర్ కుర్తా, తెల్లటి పైజామాలో కనిపించారు. కుటుంబ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటూ, శ్రీసూక్తం, గాయత్రీ దేవి హోమంలో వారు పాల్గొన్నారు.ఈ వేడుక విశేషాలను రాజ్ సోదరి సోషల్ మీడియాలో పంచుకున్నారు. కుటుంబంలోని పిన్నమ్మలు, పెద్దమ్మలు అందరూ ఒకచోట చేరి సమంతకు, పుట్టబోయే బిడ్డకు దీవెనలు అందించారని ఆమె పేర్కొన్నారు. పద్మశ్రీ శోభారాజు ప్రత్యేకంగా స్వరపరిచిన గీతాన్ని కుటుంబ సభ్యులు ఆలపించి వేడుకను మరింత ఘనంగా మార్చారు.సమంత, రాజ్‌లు 2025 డిసెంబరు 1న కోయంబత్తూరులోని ఇషా యోగా సెంటర్ లింగ భైరవి ఆలయంలో అత్యంత సన్నిహితుల మధ్య వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ', 'మా ఇంటి బంగారం' వంటి చిత్రాల్లో వీరిద్దరూ కలిసి పనిచేశారు. ఆ తర్వాత 2026 జూన్‌లో తాను గర్భవతినన్న విషయాన్ని వెల్లడించిన సమంత, 'మా ఇంటి బంగారం' చిత్రం అనంతరం ప్రసవం కోసం నటన నుంచి విరామం తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు బాబు రాకతో ఆ ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది.

ఆకలేస్తే చిరంజీవి గారి ఇంటికెళ్లి భోజనం చేసేవాడిని
: నాజర్ భావోద్వేగం



సినీ పరిశ్రమలో విలక్షణ నటనతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు నాజర్, తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న గడ్డు పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టడానికి ముందు, ఆ తర్వాత అవకాశాల కోసం తిరుగుతున్న సమయంలో ఎన్నో ఆకలి రోజులను చూశానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్లిష్ట సమయంలో మెగాస్టార్ చిరంజీవి కుటుంబం తనకు అందించిన మద్దతును ఆయన ఎంతో భావోద్వేగంతో పంచుకున్నారు.అవకాశాల కోసం చెన్నైలో ఎదురుచూస్తున్న రోజుల్లో భోజనానికి కూడా ఇబ్బంది పడిన సందర్భాలు ఎదురయ్యాయని నాజర్ వెల్లడించారు. అలాంటి సమయాల్లో తాను చిరంజీవి ఇంటికి వెళ్లి భోజనం చేసేవాడ్నని తెలిపారు. అప్పట్లో చిరంజీవి వరుస షూటింగులతో బిజీగా ఉండేవారని, తన స్నేహితుడి ద్వారా చిరంజీవి అర్ధాంగి సురేఖను సంప్రదించి, ఇంట్లో భోజనం ఉందో లేదో తెలుసుకునేవాడ్నని వివరించారు. భోజనం అందుబాటులో ఉందని తెలియగానే అక్కడికి వెళ్లి తిని వచ్చేవాడ్నని చెప్పారు. ఒక్కోసారి తాను వెళ్లి భోజనం చేసి వచ్చిన విషయం చిరంజీవికి తెలిసేది కాదని, ఆయన షూటింగులో ఎక్కడో ఉండేవారని తెలిపారు. వారి కుటుంబం తనకు చేసిన ఆ సాయం వెలకట్టలేనిదని నాజర్ పేర్కొన్నారు.నటన వైపు అడుగులు వేయడంలో తన తండ్రి ప్రోత్సాహం ఎంతో ఉందని నాజర్ తెలిపారు. తనలోని ప్రతిభను గుర్తించి సినీ రంగంలోకి వెళ్లమని తండ్రే సూచించారని చెప్పారు. ఆ తర్వాత చెన్నై చేరుకుని ఓ చిన్న ఉద్యోగంలో చేరారు. యాక్టింగ్ స్కూల్ ఫీజు చెల్లించే స్తోమత లేకపోవడంతో, ఆఫీస్ సమయం ముగిసిన తర్వాత అదనంగా చిన్న చిన్న పనులు చేస్తూ డబ్బు ఆదా చేసుకున్నారు. చిత్రపరిశ్రమలో ఒక నటుడిగా నిలదొక్కుకోవడానికి తనకు దాదాపు 15 ఏళ్ల సమయం పట్టిందని ఆయన వివరించారు.ఇక తెలుగు చిత్రపరిశ్రమలో తన అరంగేట్రం గురించి మాట్లాడుతూ.. వెంకటేశ్ హీరోగా తెరకెక్కిన 'చంటి' సినిమాతో తాను టాలీవుడ్‌కు పరిచయమయ్యానని తెలిపారు. ఆ సమయంలో తనకు తెలుగు భాష అస్సలు రాదని, కానీ స్టార్ హీరో అయినప్పటికీ వెంకటేశ్ ఎంతో ఓపికగా ప్రతి డైలాగ్‌ను వివరించి, పాత్ర స్వభావాన్ని అర్థం చేసుకునేలా ప్రోత్సహించారని చెప్పారు.కష్టకాలంలో చిరంజీవి, సురేఖ చూపిన దాతృత్వం.. అలాగే వెంకటేశ్ అందించిన సహకారం తన సినీ ప్రయాణంలో ఎప్పటికీ మరచిపోలేనివని నాజర్ కృతజ్ఞతతో స్మరించుకున్నారు. ఎటువంటి గుర్తింపును ఆశించకుండా నిస్వార్థంగా చేసే సాయమే అత్యంత గొప్పదని ఆయన అన్నారు.

తెలిసిన వారినే ప్రశ్నించడానికి ఎందుకు వెనుకాడుతున్నాం?



సమాజంలో ఎక్కడైనా చిన్నపిల్లలపై లైంగిక వేధింపుల ఘటన జరిగినప్పుడు అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడి ఆవేదన వ్యక్తం చేస్తాం. కానీ ఆ వార్త పాతబడగానే మళ్లీ ఎప్పటిలాగే మౌనంలోకి జారిపోతామన్నది అంతే నిజం. తాజాగా ఈ అంశంపై బాలీవుడ్ నటి విద్యాబాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులపై జరిగే ఇలాంటి అఘాయిత్యాలను అరికట్టే బాధ్యత పిల్లలది కాదని.. పూర్తిగా పెద్దలదేనని కుండబద్దలు కొట్టారు. 2018 నుంచి -అర్పణ్- అనే స్వచ్ఛంద సంస్థకు గుడ్‌విల్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న విద్యాబాలన్.. చైల్డ్ సేఫ్టీ వీక్ సందర్భంగా సమాజంలోని లోపాలను ఎత్తి చూపారు. వేధింపులకు పాల్పడే వ్యక్తులు ఎవరూ పట్టుబడరనే ధీమాతోనే రెచ్చిపోతున్నారని విద్యాబాలన్ అభిప్రాయపడ్డారు. పిల్లల మౌనం.. కుటుంబ పరువు పోతుందనే పెద్దల భయం.. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సమాజం వెనుకాడే ధోరణే నేరగాళ్లకు కొండంత అండగా మారుతుందన్నారు. కఠినమైన అడుగులు వేయాల్సిన చోట పెద్దలంతా ఆగిపోతున్నారని.. మనకు ఎంతో నమ్మకమైన.. తెలిసిన వారినే ప్రశ్నించడానికి ఎందుకు వెనుకాడుతున్నామని విద్య సూటిగా ప్రశ్నించారు. సొంత కుటుంబంలోనే కొన్ని కఠినమైన హద్దులు గీయడం.. ఒక చిన్నారి ధైర్యం చేసి తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పినప్పుడు దాన్ని గుడ్డిగా కొట్టిపారేయకుండా నమ్మడం పెద్దల కనీస బాధ్యత అని విద్యాబాలన్ గుర్తు చేశారు. ఇంటి పరువు బజారున పడుతుందనే భయంతో నిజాన్ని నాలుగు గోడల మధ్యే సమాధి చేయడం వల్ల నేరగాళ్లకు మరింత బలం చేకూరుతుందని హెచ్చరించారు. పోక్సో చట్టం ఎంత కఠినంగా ఉందో? ప్రజల్లోకి తీసుకెళ్లి నేరం చేస్తే శిక్ష తప్పదనే భయం ప్రతి ఒక్కరిలో కలగాలన్నారు. గతంలో తాను నటించిన -కహానీ 2- సినిమాలో దుర్గా రాణి పాత్ర చేస్తున్నప్పుడే బాలల వేధింపుల వెనుక ఉన్న చేదు నిజాలు.. బాధితులపై జీవితాంతం ఉండే మానసిక గాయాల గురించి లోతుగా అర్థమైందని విద్యాబాలన్ గుర్తు చేసుకున్నారు. ఆ సినిమా విడుదలైన తర్వాతే ఇన్నాళ్లూ కార్పెట్ కింద దాచిపెట్టిన ఈ సున్నితమైన అంశంపై ఇళ్లలో చర్చ మొదలైందన్నారు. అయితే ఇలాంటి కథలను తెరకెక్కించేటప్పుడు దర్శక,నిర్మాతలు బాధితులను తప్పుపట్టకుండా.. సంచలనాల కోసం కాకుండా ఎంతో బాధ్యతగా చూపించాలని సూచించారు.కవలం సినిమాలు తీయడం వల్లనో? సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం వల్లో? చిన్నారులకు రక్షణ దక్కదని విద్యాబాలన్ తేల్చి చెప్పారు. సినిమాలు కేవలం ఒక చర్చను మాత్రమే మొదలుపెట్టగలవని ఆ తర్వాత క్షేత్రస్థాయిలో పనిచేసే సంస్థలకు అండగా నిలవడం.. బాధితులకు న్యాయం జరిగేలా చూడటం అందరి బాధ్యత అన్నారు. ఇటీవలే విద్యాబాలన్ -జైలర్ 2- లో కాంత పాత్రతో ఎలా అలరించారో తెలిసిందే. కల్ట్ ఫ్యామిలీ వారసురాలిగా విద్య ఓ రేంజ్ లో అదరగొట్టారు. ప్రస్తుతం విద్య బాలన్ నటిస్తోన్న మరో మూడు బాలీవుడ్ చిత్రాలు ఆన్ సెట్స్ లో

'ఆయనతో ఒక్క ఫోటో చాలనుకున్నా..

ప్రముఖ నటి, దర్శకురాలు రేణూ దేశాయ్ చాలా కాలం తర్వాత మళ్లీ వెండితెరపై కనిపించబోతున్నారు. మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఓం' చిత్రంతో ఆమె నటిగా పునరాగమనం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, ఈ అవకాశం ఎలా వచ్చింది, తన ఆరోగ్య రహస్యం ఏంటి అనే విషయాలపై ఆసక్తికరమైన వివరాలు పంచుకున్నారు.మమ్ముట్టి లాంటి గొప్ప నటుడితో కలిసి నటించే అవకాశం రావడం తనను ఆశ్చర్యపరిచిందని రేణూ దేశాయ్ అన్నారు. "గతేడాది ఆయన సినిమాలు చూస్తూ, ఎప్పటికైనా ఆయన్ను కలిసి ఒక ఫొటో దిగితే చాలనుకున్నాను. కానీ ఆయన సరసన నటించే అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదు" అని తెలిపారు. మహాశివరాత్రి రోజున తాను కామాఖ్య దేవాలయంలో ఉన్నప్పుడు చెన్నై నుంచి ఓ అసిస్టెంట్ డైరెక్టర్ ఫోన్ చేసి మమ్ముట్టి సినిమాలో భార్య పాత్రకు ఆఫర్ చేశారని చెప్పారు. మొదట దాన్ని ఒక ప్రాంక్ కాల్ అనుకుని నమ్మలేకపోయానని ఆమె గుర్తుచేసుకున్నారు. రెండు నెలల తర్వాత చిత్రానికి 'ఓం' అని పేరు ప్రకటించగానే తనకు గూస్‌బంప్స్ వచ్చాయని, ఇదంతా దైవ సంకల్పమేనని భావిస్తున్నానని అన్నారు.గత ఏడాది తనకు ఒక సర్జరీ జరిగిందని, దానివల్ల దాదాపు ఆరు నెలల పాటు పూర్తి విశ్రాంతి తీసుకున్నానని రేణూ దేశాయ్ తెలిపారు. ఆ సమయంలో కిచిడీ, పెసరపప్పు, సొరకాయ వంటి తేలికపాటి ఆహారం మాత్రమే తీసుకున్నానని చెప్పారు. ఈ ఆహార నియమాలు, విశ్రాంతి వల్లే శరీరంలో వాపు తగ్గి ఇప్పుడు మరింత ఫ్రెష్‌గా కనిపిస్తున్నానని తన ఆరోగ్య రహస్యాన్ని వెల్లడించారు. సోషల్ మీడియాలో సాధారణంగా కనిపించే తనకు భిన్నంగా, ఓ నటిగా మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడం సంతోషంగా ఉందని రేణూ దేశాయ్ పేర్కొన్నారు.



బన్నీ రేసులో బోయపాటి నెంబర్ - 4!



-పుష్ప- విజయంతో పాన్ ఇండియా బాక్సాఫీస్‌ను శాసిస్తున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తదుపరి సినిమాల విషయం లో పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం బన్నీ చేతిలో ఉన్న క్రేజీ ప్రాజెక్టుల జాబితా చూస్తే? అసక్తి అంతకంతకు రెట్టింపు అవుతుంది. అందులో మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను స్థానం ఇప్పుడు చర్చ నీయాంశంగా మారింది. అల్లు అర్జున్ తదుపరి సినిమాల రేసులో బోయపాటి ప్రాజెక్ట్ నాలుగో స్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బన్నీ ఫోకస్ అంతా తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ -రాకా- పైనే పెట్టారు. సన్ పిక్చర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరు గుతోంది. గతంలో ఇద్దరి కాంబినేషన్‌లో రిలీజ్ అయిన -సరైనోడు- బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. ఈ నేపథ్యంలో బన్నీ కోసం బోయపాటి పవర్‌ఫుల్ మైథలాజికల్ టచ్ ఉన్న కథను సిద్ధం చేస్తున్నారని.. అది బన్నీకి బాగా నచ్చి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ప్రచారం జరుగుతోంది.అయితే ఏ సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందన్నది అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది. లోకేష్ ప్రాజెక్ట్ మాత్రం వచ్చే ఏడాది పట్టాలెక్కుతుంది. ఈ సినిమా షూటింగ్ కూడా లోకేష్ వేగంగానే పూర్తి చేస్తారు. ఈ విషయంలో లోకేష్ పెద్దగా సమయం తీసుకోరు. చిత్రీకరణ ముగించే విషయంలో లోకేష్ -లియో- స్ట్రాటజీ అనుసరిస్తారని చిత్ర వర్గాల నుంచి తెలుస్తోంది. ఎలా చూసుకున్నా? బోయపాటి ప్రాజెక్ట్ పట్టాలెక్కాలంటే? ఎలా లేదన్నా రెండున్నరేళ్లకు పైగా సమయం పడుతుంది.